

పరీక్షలకు కల్తీ

■ ప్రాంతీయ ప్రయోగశాల నిర్వీర్యం
■ వేధిస్తున్న సిబ్బంది కొరత

ఈనాడు, కర్నూలు, న్యూస్‌టుడే కర్నూలు వైద్యాలయం: ఆహార పదార్థాల్లో కల్తీలు పరీక్షించే ప్రయోగశాలకు తుప్పుపట్టింది. ఎంతో సదుద్దేశంతో కర్నూలు వైద్య కళాశాల ఆవరణలో 1958లో ఏర్పాటు చేసిన 'ప్రాంతీయ ప్రయోగశాల' నిర్వీర్యమైంది. ఆరోగ్య, కుటుంబ సంక్షేమ విభాగం డైరెక్టర్ పరిధిలోని 'ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్' (ఐ.పి.ఎం.) ఆధ్వర్యంలో దీనిని నిర్వహిస్తున్నారు. నామమాత్రపు ఛార్జీలతో మంచి నీరు, ఆహార ఉత్పత్తులు, నూనెలు, పాలు, పప్పులు, పొడులు, వ్యాధి నిర్ధారణ పరీక్షలు ఇక్కడ చేయాల్సి ఉంది. 2009లో కర్నూలు నగరానికి పెద్దఎత్తున వరదలు వచ్చినప్పుడు ప్రయోగశాల భవనం సగం వరకు మునిగిపోయింది. ఉపకరణాలు దెబ్బతిన్నాయి. అప్పటినుంచి ఇప్పటివరకు కొత్త పరికరాలు రాలేదు. ఫలితంగా ప్రయోగశాలలో పలురకాల పరీక్షల నిర్వహణకు మంగళం పాడారు. ప్రస్తుతం ఆహార పదార్థాల్లో కల్తీలు పెరిగిన నేపథ్యంలో ప్రయోగశాలను ఆధునికీకరించాల్సిన అవసరం ఉంది.

నీటి పరీక్షలతోనే నెట్టుకొస్తున్నారు

ప్రాంతీయ ప్రయోగశాలలో ప్రస్తుతం ఇన్‌క్యుబేటర్, ఎలక్ట్రిక్ కండక్టివిటీ (ఇ.సి.) మీటరు, పీహెచ్ మీటరు, ఎలక్ట్రానిక్ బ్యాలెన్స్ మాత్రమే ఉన్నాయి. ఆయా పరికరాలతో నీటి నాణ్యతను, స్వచ్ఛతను మాత్రమే తెలుసుకోవచ్చు. కార్యాలయంలో ఒక సీనియర్ వాటర్ ఎనలిస్ట్, ఒక జూనియర్ వాటర్ ఎనలిస్ట్ ఉండడంతో నీటికి సంబంధించిన రసాయన, బ్యాక్టీరియల్ ఎనాలసిస్ పరీక్షలు చేస్తున్నారు. ప్రజారోగ్యానికి సంబంధించిన పరీక్షల్లో టీబీ పరీక్షలు మాత్రమే చేయగలుగుతున్నారు. ఇతర వ్యాధి నిర్ధరణ పరీక్షలేవీ జరగడంలేదు.

సంవత్సరం	పరీక్షించిన నీటి నమూనాలు	వచ్చిన ఆదాయం
2022-23	12,156	రూ.10,20,720
2023-24	12,012	రూ.10,26,100

వ్యవస్థను ఎత్తేశారు

- నూనెలు, పాలు, పప్పులు, కాఫీ, టీ తదితర పొడులకు సంబంధించిన కల్తీలు నిర్ధరించేందుకు కార్యాలయంలో ఇద్దరు జూనియర్ సైంటిఫిక్ అధికారులను గతంలో నియమించారు. ప్రస్తుతం ఆ రెండు పోస్టులు గత కొన్నేళ్లుగా ఖాళీగానే ఉన్నాయి. ఫలితంగా ఆయా ఉత్పత్తుల్లో కల్తీని నిర్ధారించే పరీక్షలు నిర్వహించే వ్యవస్థను ఎత్తేశారు. ఆ రెండు పోస్టులు భర్తీ చేసినా ఆహార పదార్థాల కల్తీని గుర్తించే ఉపకరణాలు ఒక్కటి కూడా లేదు.
- కార్యాలయ ఉన్నతాధికారిగా సివిల్ సర్జన్ బ్యాక్టీరియాలజిస్ట్ (సి.ఎస్.బి.) బాధ్యతలు నిర్వర్తిస్తుంటారు. గత పదేళ్లుగా ఆ పోస్టు ఖాళీగా ఉంది. ఆయన ఆధ్వర్యంలో విధులు నిర్వర్తించేందుకు ఇద్దరు సివిల్ అసిస్టెంట్ సర్జన్లు ఉంటారు. ఆ ఇద్దరు మాత్రం ఉండడంతో వారిలో ఒకరు కార్యాలయ ఇన్‌ఛార్జిగా కొనసాగుతున్నారు.

ఉద్యోగుల కుర్చీలన్నీ ఖాళీ

- నలుగురు ల్యాబ్ టెక్నీషియన్లు ఉండాల్సి ఉండగా పోస్టులన్నీ ఖాళీగా ఉన్నాయి. ఫలితంగా ప్రయోగ పరీక్షలన్నీ పడకేశాయి. నమూనాలు సేకరించేవారు ముగ్గురు ఉండాల్సి ఉండగా ఒక్కరు మాత్రమే అందుబాటులో ఉన్నారు. ఒకరిని ఒప్పంద ప్రాతిపదికన నియమించుకున్నారు. ముగ్గురు జూనియర్ వాటర్ ఎనలిస్ట్‌లు ఉండాల్సి ఉండగా ఒక్కరు మాత్రమే ఉన్నారు.
- దశాబ్దాల కిందట ఏర్పాటుచేసిన సంస్థ కావడంతో పలువురు ఉద్యోగులు పదవీ విరమణ చేశారు. ఆ తర్వాత భర్తీ ప్రక్రియ చేపట్టకపోవడంతో కార్యాలయంలో సిబ్బంది సంఖ్య క్రమంగా తగ్గుతూ వచ్చింది. మొత్తం 25 మంది సిబ్బందికిగాను కేవలం ఏడుగురు మాత్రమే ఉన్నారు.

బన్ని ఉత్సవానికి ముహూర్తం ఖరారు



దేవరగట్టు కర్రల సమరానికి ముహూర్తం ఖరారైంది. బన్ని జైత్రయాత్రను ఆలయ కమిటీ నిర్వాహకులు, పురోహితులు శుక్రవారం వివరించారు.

✦ అక్టోబరు 7వ తేదీన నెరణికి పురోహితులతో గణపతిపూజ, స్వామికి కంకణధారణ, నిశ్చితార్థం, ధ్వజారోహణం

✦ 12న దసరా రోజున మాంగళ్య ధారణ, కల్యాణోత్సవం, జైత్రయాత్ర

✦ 13న ఉదయం నెరణికి గ్రామ పూజారి దైవకార్ణికం (భవిష్యవాణి)

✦ 14న స్వామి వారికి అభిషేకాలు, బండారు అర్చన, సాయంత్రం రథోత్సవం

✦ 15న ఉదయం గొరవయ్యల ఆట, గొలుసు తెంపుట, వసంతోత్సవం, సాయంత్రం కంకణ విసర్జన

✦ 16న మాళమల్లేశ్వరస్వామి విగ్రహాలు నెరణికి చేరడంతో బన్ని ఉత్సవం ముగుస్తుంది.

హాలహర్వి, హొళగుంద, న్యూస్‌టుడే:

వదల బొమ్మాళీ.. వదల!

■ కలెక్టరేట్‌లో కదలని పీఠాలు

■ ఏళ్లుగా డిప్యుటేషన్లపై విధులు



సచివాలయం, న్యూస్‌టుడే : ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న ఉద్యోగులను బదిలీ చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. బదిలీలు పారదర్శకంగా నిర్వహించాలని సూచించింది. అన్ని విభాగాల్లో పీఠాలు కదిలినా కలెక్టరేట్‌లో పీఠాలు కదల్లేదు. చాలామంది ఉద్యోగుల సర్వీసు పదేళ్లు దాటినా అదే సీట్లలో తిష్టేశారు. ఇతర మండలాలకు డిప్యుటేషన్ వేయించుకోవడం.. తిరిగి కలెక్టరేట్‌లోనే విధులు నిర్వహిస్తున్నారు. ప్రక్షాళన చేయాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినా అమలు కావడం లేదు.

పదోన్నతే వద్దని

సి. సెక్షన్‌లో ఓ మహిళ అటెండర్‌గా.. జూనియర్ అసిస్టెంట్‌గా 20 ఏళ్లపాటు కొనసాగుతున్నారు.. పదోన్నతి వద్దంటూ జూనియర్ అసిస్టెంట్‌గా కలెక్టరేట్‌కే పరిమితమయ్యారు. ఆమెకు బదిలీ నుంచి మినహాయింపు ఇచ్చారట.

అందుకే కొనసాగిస్తున్నారట

గతంలో రెవెన్యూ అధికారులు, ఉద్యోగులు, సిబ్బందికి ఆరు నెలలు, ఏడాదికోసారి పాలనా పరమైన అంశాలు, దస్త్రాలు పంపే విధానం.. నోట్‌ఫైల్ రాసే విధానం తదితర వాటిపై తర్ఫీదు ఇచ్చేవారు. గత ఐదేళ్లకు పైగా ఒక్క శిక్షణ కార్యక్రమం నిర్వహించలేదు. కలెక్టరేట్‌లో పోస్టింగ్ ఇస్తామంటే మండలాల నుంచి ఎవరూ రావడం లేదు.. అందువల్లే డిప్యుటేషన్లపై పాలన నెట్టుకొస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు.

కలెక్టరేట్ బి. సెక్షన్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా చేరి ఉప తహసీల్దారుగా ఉద్యోగోన్నతి పొందారు. ఓ మండలానికి డిప్యుటేషన్‌పై వేయించుకుని తిరిగి కలెక్టరేట్‌కొచ్చారు. బి. సెక్షన్‌తోపాటు సాంఘిక సంక్షేమం, భూసేకరణ విభాగం డీటీగా డిప్యుటేషన్‌పై పనిచేశారు. ఇలా.. 12 ఏళ్లకుపైగా ఆ సెక్షన్ నుంచి మారలేదు. వేతనాల బిల్లులు చేసేది ఆయనే. ఇతరులకు ఆ పనిచేయడం రాదంటూ అక్కడే కొనసాగిస్తున్నారు. ప్రస్తుత సాధారణ బదిలీల్లో భాగంగా కలెక్టరేట్ నుంచి హెచ్ఎన్ఎస్ఎస్-యూనిట్-3కి బదిలీ అయ్యారు. 24 గంటలు గడవక ముందే సి. బెళగల్ డీటీగా నియమించారు. అక్కడి నుంచి డిప్యుటేషన్‌పై వచ్చారు.

పెత్తనమంతా చిన్న డీఆర్వోదే

'చిన్న డీఆర్వో'గా పేరొందిన ఓ జూనియర్ అసిస్టెంట్ ఏళ్లుగా కలెక్టరేట్‌లో పెత్తనం చేస్తున్నారు. అన్ని శాఖల్లో తలదూరుస్తున్నారు. అర్హత లేకున్నా ప్రొటోకాల్ విభాగాన్ని అప్పగించారు. పలు అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్నా ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ఆయన లేకుంటే కలెక్టరేట్ పాలన ముందుకు సాగదేమో అన్నట్లు మారింది.

- అమరావతి ఎక్స్‌ప్రెస్‌వే డీటీని కర్నూలు రూరల్‌కు బదిలీ చేశారు. వెంటనే ఆయన్ను అక్కడినుంచి తిరిగి అమరావతి ఎక్స్‌ప్రెస్‌వే స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కార్యాలయ డీటీగా నియమించారు.
- ఓ మహిళా సీనియర్ అసిస్టెంట్ జిల్లా పౌరసరఫరాల శాఖ, డి. సెక్షన్, ఎ. సెక్షన్‌లో పదేళ్లకుపైగా పనిచేస్తున్నారు.
- సి. సెక్షన్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా చేరిన మహిళ ఆర్ఐ సర్వీసు మండలంలో చేయాలి. ఈ నేపథ్యంలో చిప్పగిరి ఆర్ఐగా బదిలీ చేయించుకొని తిరిగి కలెక్టరేట్‌కు వచ్చారు. ఆ తర్వాత సీనియర్ అసిస్టెంట్‌గా.. ఇలా 8 ఏళ్లకు పైగా అక్కడే పనిచేస్తున్నారు.
- ప్రస్తుతం కలెక్టరేట్‌లో డీటీగా పనిచేస్తున్న వ్యక్తి ఏడేళ్ల నుంచి ఇక్కడే కొనసాగుతున్నారు. ప్రస్తుతం పత్తికొండ ఆర్డీవో కార్యాలయ ఎల్ఆర్ డీటీగా బదిలీ చేసినప్పటికి తిరిగి కలెక్టరేట్‌లోనే డిప్యుటేషన్‌పై కొనసాగనున్నారనే ప్రచారం జరుగుతోంది.
- ప్రస్తుతం డి. సెక్షన్‌లో డీటీగా పనిచేస్తున్న మహిళ 2009-10 నుంచి కలెక్టరేట్‌లోనే పనిచేస్తున్నారు. కొంతకాలం జేసీ పేషీలో, డీఎస్‌వో కార్యాలయం, డి. సెక్షన్‌లో.. ఇలా కలెక్టరేట్ వదిలి బయటకు వెళ్లలేదు.

అలా వెళ్లి.. డిప్యుటేషన్లపై వచ్చి

ఎందుకు బదిలీ చేసినట్లో


కర్నూలు గ్రామీణ తహసీల్దారు కార్యాలయంలో ఉప తహసీల్దారుగా పనిచేస్తున్న కె. శివప్రసాద్‌ను సాధారణ బదిలీల ప్రక్రియలో భాగంగా కర్నూలు అమరావతి ఎక్స్‌ప్రెస్‌వే స్పెషల్ డిప్యూటీ కార్యాలయ ఉప తహసీల్దారుగా బదిలీ చేశారు. ఆయన విధుల్లో చేరలేదు. బదిలీ చేసిన 24 గంటల్లోనే తిరిగి కర్నూలు రూరల్ మండల ఉప తహసీల్దారుగా నియమించారు. మరి.. ఆయన్ను ఎందుకు బదిలీ చేశారో రెవెన్యూ యంత్రాంగానికే తెలియాలని పలువురు పేర్కొంటున్నారు.

అనుభవం ఉందంటూ

మహిళా ఉప తహసీల్దారు గత పదేళ్లుగా కలెక్టరేట్ జి. సెక్షన్‌లోనే విధులు నిర్వహిస్తున్నారు. ఆమెను సి. బెళగల్ డీటీగా నియమించినప్పటికీ అక్కడ పనిచేసింది లేదు. తిరిగి డిప్యుటేషన్‌పై వచ్చారు. ప్రస్తుత బదిలీల్లో భాగంగా కేఆర్ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కార్యాలయానికి బదిలీ చేయించుకున్నా.. తిరిగి కలెక్టరేట్‌లోని అదే సెక్షన్‌లో తన స్థానం పదిలం చేసుకున్నారు. ప్రభుత్వ పనులకు.. వివిధ శాఖలకు సంబంధించిన భూసేకరణలో అనుభవం ఉందంటూ ఆమెను అదే సెక్షన్‌లో కొనసాగిస్తున్నారు.

తీగలాగితే రూ.5 కోట్ల అక్రమాలు

■ విద్యుత్తు నియంత్రికల సామగ్రి అమ్మేశారు



నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: విద్యుత్తు శాఖలో కొందరు అధికారులు, వైకాపా నేతలు కలిసి 'తుప్పు'ను అమ్మకానికి పెట్టారు. కాలిపోయిన నియంత్రికల్లో ఉన్న తీగలు, ఇతర సామగ్రిని సరిహద్దు దాటించి రూ. కోట్లు వెనకేసుకొన్నారు. విద్యుత్తు నియంత్రికల మరమ్మతు కేంద్రాల నిర్వహణ గుత్తేదారులకు అప్పగిస్తుంటారు. గత ఐదేళ్ల వైకాపా పాలనలో ఆ పార్టీకి చెందిన కొందరు నేతలు గుత్తేదారులుగా అవతారమెత్తారు. అక్కడున్న సామగ్రిని అమ్మకానికి పెట్టారు. ఐదేళ్లలో రూ.5 కోట్ల స్క్రాప్ సొమ్మును పక్కదారి పట్టించినట్లు ఇటీవల నిర్వహించిన తనిఖీల్లో బయటపడింది.

తొమ్మిది కేంద్రాల్లో దందా

కర్నూలు, ఎమ్మిగనూరు, ఆదోని, పత్తికొండ, నంద్యాల, బనగానపల్లి, ఆళ్లగడ్డ, డోన్, ఆత్మకూరు పట్టణాల్లో విద్యుత్తు నియంత్రికల మరమ్మతుల కేంద్రాలు ఉన్నాయి.. కాలిపోయిన నియంత్రికలను మరమ్మతులు చేయించుకోవడానికి రైతులు ఆయా కేంద్రాలకు తీసుకొస్తుంటారు. ఏడాదికి ఒక్కో కేంద్రానికి 1000 నుంచి 1,200 వరకు వస్తుంటాయి. వాటిని బాగు చేసే క్రమంలో రాగి, అల్యూమినియం తీగలు తొలగించి కొత్తవాటిని బిగించాలి. తొలగించిన తీగలను కర్నూలు ప్రధాన కార్యాలయంలోని గోదాముకు తరలించారు.

101 నియంత్రికలు ఏమైనట్లు

కర్నూలులో 25, నంద్యాలలో 32, ఆదోనిలో 16, ఎమ్మిగనూరులో 9, ఆత్మకూరులో 11, డోన్‌లో 8 నియంత్రికలకు లెక్కలే లేవు. వీటిని గోదాములకు తరలించకుండా, వినియోగదారులకు ఇవ్వకుండా ఎక్కడికి తీసుకెళ్లారనే వివరాల్లేవు. నియంత్రికలతో పాటు రాగి, అల్యూమినియం వివరాలు సరిగ్గా లేవని ఇటీవల ఉన్నతాధికారులు నిర్ధారణకు వచ్చారు. కర్నూలు గోదాముకు చేరిన స్క్రాప్‌ను ముందస్తు ఒప్పందం ప్రకారం అస్మదీయ వ్యాపారులకే కట్టబెడుతున్నారు. మూడేళ్లుగా పక్క రాష్ట్రానికి చెందిన గుత్తేదారులకే గుట్టుచప్పుడు కాకుండా ఇస్తున్నారు.

లెక్కలు మాయం

నియంత్రికల కేంద్రాల్లో పోగైన పాతసామగ్రిని ఎప్పటికప్పుడు కర్నూలు గోదాముకు తరలించకుండా వ్యాపారులకు అమ్మేశారు. విద్యుత్తు నియంత్రికల మరమ్మతుల తర్వాత ఎంత స్క్రాప్ మిగిలింది ? ఎంత కర్నూలుకు తరలించారనే వివరాలు తొమ్మిది కేంద్రాల్లో లేవు. కేవలం మరమ్మతులు చేసిన నియంత్రికలు, కర్నూలుకు తరలించిన సామగ్రి సమాచారమే ఉంది. కేంద్రాల నిర్వహణకు ప్రత్యేక విభాగం ఉంది. నెలలో రెండుసార్లు ఈఈ, ఆరుసార్లు డీఈఈలు పరిశీలించాలి. లెక్కలపై ఆరా తీయాలి.. గత ఐదేళ్లలో ఇవేవీ జరగలేదు.

పాతసామగ్రి పక్కదారి

టన్ను అల్యూమినియం తీగ విలువ ప్రస్తుతం బహిరంగ మార్కెట్లో రూ.1.40 లక్షలు పలుకుతోంది. టన్ను రాగి విలువ రూ.5.50 లక్షల వరకు ఉంది. ఒక్కో మరమ్మతు కేంద్రంలో సగటున ఏడాదికి 25 టన్నుల వరకు రాగి, 15 టన్నుల వరకు అల్యూమినియం స్క్రాప్ రూపంలో పోగవుతోందని అంచనా. నంద్యాల, ఆదోని, కర్నూలు కేంద్రంగా పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయి. కొందరు అధికారులు అక్రమార్కులతో చేతులు కలిపి అవినీతికి పాల్పడినట్లు తెలుస్తోంది. గత ఐదేళ్ల రూ.5 కోట్ల వరకు స్క్రాప్ రూపంలో పక్కదారి పట్టినట్లు ఆరోపణలు ఉన్నాయి.



'స్వచ్ఛ'ందంగా తరలొచ్చారు.. గుర్రపు డెక్క తొలగించారు

బి.తాండ్రపాడులోని గంగమ్మ చెరువును ప్రక్షాళన చేసేందుకు గ్రామస్థులందరూ ఏకమయ్యారు. చెరువులో నాలుగు ఎకరాల్లో ఏపుగా పెరిగిన గుర్రపు డెక్కను గత రెండు రోజులుగా తొలగించే పని చేపట్టారు. చెరువులో గుర్రపు డెక్క ఏపుగా పెరిగిపోవడంతో నీటి ప్రవాహానికి ఆటంకం కలుగుతోంది. వరద నీరు ఇళ్లను ముంచెత్తే ప్రమాదం ఉండటంతో అందరూ కలసికట్టుగా తరలివచ్చి స్వచ్ఛత కార్యక్రమం చేపట్టారు. కొందరు యువకులు ట్యూబుల్లో వెళ్లి గుర్రపు డెక్కకు తాళ్లు కట్టి బయటకు లాగారు. పొక్లెయిన్ సాయంతో పూడిక సైతం తొలగించారు. - ఈనాడు, కర్నూలు

బీఈడీ సెమిస్టర్ పరీక్షలు వాయిదా

కర్నూలు విద్య, న్యూస్‌టుడే : రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో అక్టోబరు 1వ తేదీ నుంచి 8వ తేదీ వరకు జరగాల్సిన బీఈడీ 1వ సెమిస్టర్ పరీక్షలు వాయిదా వేస్తున్నట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినర్ వెంకటేశ్వర్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షల తేదీల్లో టెట్ ఉండటంతో ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. 1వ సెమిస్టర్ పరీక్షలు ఎప్పుడు నిర్వహిస్తామన్న విషయాన్ని త్వరలో ప్రకటిస్తామన్నారు.

1న సీఎం చంద్రబాబు రాక



కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు జిల్లా పర్యటన ఖరారైంది. ఆయన వచ్చే నెల 1వ తేదీ మధ్యాహ్నం 12.30 గంటలకు కర్నూలు విమానాశ్రయం చేరుకుంటారు. అక్కడినుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి మధ్యాహ్నం 1.05 గంటలకు పత్తికొండ మండలం పుచ్చకాయలమడ గ్రామ జడ్పీ పాఠశాల ఆవరణలో ఏర్పాటుచేసిన హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడ ప్రజాప్రతినిధులు, అధికారులు, ఇతరులతో ముఖాముఖి అవుతారు. మధ్యాహ్నం 1.40 గంటలకు రోడ్డు మార్గంలో పుచ్చకాయలమడ గ్రామానికి చేరుకుని 2.25 గంటల వరకు ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పింఛను సొమ్ము పంపిణీ చేస్తారు. మధ్యాహ్నం 2.25 గంటల నుంచి 3.25 గంటల వరకు గ్రామస్థులతో సీఎం ముఖాముఖి అవుతారు. అనంతరం రోడ్డు మార్గంలో బయలుదేరి జడ్పీ పాఠశాల ఆవరణలోని హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. 3.35 గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరి సాయంత్రం 4 గంటలకు కర్నూలు విమానాశ్రయం చేరుకుంటారు. అక్కడినుంచి విమానంలో విజయవాడ వెళతారు.

నగరపాలక కమిషనర్‌కు సమన్ల జారీ

కర్నూలు విద్య, న్యూస్‌టుడే : కర్నూలు నగరపాలక సంస్థ కమిషనర్‌కు సమన్లు జారీ చేస్తూ ఉప లోకాయుక్త 24వ తేదీన ఉత్తర్వులు జారీ చేసింది. కర్నూలు జాతీయ రహదారి ఆనుకుని ఉన్న సర్వీసు రోడ్ల ఆక్రమణ విషయంలో వివరణ ఇవ్వాలని మూడు నెలల కిందట కర్నూలు నగరపాలక సంస్థ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. వారు పట్టించుకోకపోవడంతో సమన్లు జారీ చేసినట్లు తెలుస్తోంది. నవంబరు 1వ తేదీన ఉప లోకాయుక్తలో నేరుగా హాజరు కావడంతోపాటు ఆక్రమణల విషయంలో ఎందుకు చర్యలు తీసుకోలేదన్న విషయాన్ని లిఖిత పూర్వకంగా ఇవ్వాలని నగరపాలక సంస్థ కమిషనర్‌కు ఇచ్చిన సమన్లలో పేర్కొంది.

మత్తు పదార్థాల అక్రమ రవాణాపై నిఘా


కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : మాదక ద్రవ్యాల నిరోధానికి అన్నిశాఖలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని ఎస్పీ జి.బిందుమాధవ్ పేర్కొన్నారు. నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో మాదకద్రవ్యాల నిరోధక చర్యలపై శుక్రవారం సమన్వయ సమావేశం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ మాదకద్రవ్యాల దుష్ఫలితాలపై విద్యార్థులు, యువతను చైతన్యపరచాలని పేర్కొన్నారు. నగరపాలకసంస్థ కమిషనర్ రవీంద్రబాబు, డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ శాంతకుమారి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి వరలక్ష్మి, అటవీశాఖ అధికారి విజయకుమార్ పాల్గొన్నారు.

కంది కర్రల కళకళ

■ అనూహ్యంగా పెరిగిన సాగు
■ తగ్గిన పత్తి, వేరుశనగ విస్తీర్ణం



కర్నూలు వ్యవసాయం న్యూస్‌టుడే : ఖరీఫ్ 'కాలం' ముగిసింది.. నైరుతి రుతు పవనాలు తిరోగమనం పట్టాయి.. ఈ కాలంలో పంటల లెక్కల తేలింది.. ఉమ్మడి జిల్లాలో తెల్లబంగారం 68 వేల హెక్టార్లు, వేరుశనగ 21,774 వేల హెక్టార్లలో సాగు తగ్గిపోయింది. కంది అనూహ్యంగా 40 వేల హెక్టార్లలో పెరిగింది.. గతేడాది నుంచి ఇప్పటివరకు కందులు క్వింటా గరిష్ఠ ధర రూ.10 వేలు పలుకుతోంది. గిట్టుబాటు ధరలు ఉండటం.. సాగుకు పెద్దగా పెట్టుబడి అవసరం లేకపోవడం.. బెట్ట పరిస్థితులను తట్టుకునే స్వభావం ఉండటంతో చాలామంది రైతులు కంది సాగుపై మొగ్గు చూపారు. ఫలితంగా ఏకంగా 36,869.10 హెక్టార్లలో సాగు పెరిగింది. పొగాకు సాధారణం 122 హెక్టార్లు కాగా ఏకంగా 6,216.59 హెక్టార్లలో సాగవడం విశేషం.



కూరగాయల సాగు అంతంతే

జిల్లాలో 23,254 హెక్టార్లలో ఉద్యాన పంటలు సాగైనట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. పచ్చిమిర్చి 1,186.34 హెక్టార్లుగా ఉంది. బీర, కాకర, బీన్స్, సొర, వంకాయ, క్యాబేజీ, క్యారెట్, క్యాలీఫ్లవర్, దోస, బెండ, బీర, కూరగాయలు, మునగ, చిక్కుడు.. ఇలా అన్ని రకాల కాయగూరలు కలిపి 2,490.93 హెక్టార్లలో సాగయ్యాయి. ఆకుకూరల సాగు కేవలం 24 హెక్టార్లే ఉండటం గమనార్హం.

చిరుసాయం.. సాగు శూన్యం

చిరు ధాన్యాల సాగును ప్రోత్సహించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏటా సుమారు అర కోటి వరకు నిధులు ఖర్చు చేస్తున్నా ఆశించిన ఫలితాలు రావడం లేదు. ఉమ్మడి జిల్లాలో రాగులు ఒక ఎకరా, వరిగలు 1.98 ఎకరాల్లో మాత్రమే సాగవడం గమనార్హం. అరికలు, అండుకొర్రలు, ఊదలు, వరిగలు తదితర చిరుధాన్యాల సాగు చేపట్టలేదు. మరి.. ఆ నిధులంతా ఏమవుతోందో తెలియని పరిస్థితి.

తెల్లబోయిన బంగారం

గతేడాది 2.70 లక్షల హెక్టార్లలో పత్తి సాగవగా.. ఈ ఖరీఫ్‌లో 1.92 లక్షల హెక్టార్లకు పడిపోయింది. జులైలో వర్షాభావ పరిస్థితులు నెలకొనడం.. గత మూడేళ్లు లాభాలు లేకపోవడంతో రైతులు విముఖత కనబరిచారు. ఫలితంగా గతేడాదితో పోలిస్తే 78 వేల హెక్టార్లకు పడిపోయింది.

ఘాటు తగ్గిన మిరప

గతేడాది గుంటూరు జిల్లాను మించి 59,491 హెక్టార్లలో సాగైంది. ఆశించిన మేర గిట్టుబాటు ధరలు రాకపోవడం.. పెట్టుబడి భారీగా పెరగడం.. దిగుబడులు అంతంతమాత్రంగానే రావడంతో చాలా మంది రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయారు. దీంతో గతేడాదితో పోలిస్తే ఏకంగా 22,974 హెక్టార్ల మేర సాగు పడిపోవడం గమనార్హం.

విజిలెన్స్ అధికారుల ఆరా

కర్నూలు నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే: కర్నూలు నగరపాలకసంస్థ కార్యాలయాన్ని విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖ అధికారులు శుక్రవారం సందర్శించారు. పట్టణ ప్రణాళిక విభాగంలో జారీ చేసిన టీడీఆర్ బాండ్ల అంశంపై ఆరా తీశారు. విజిలెన్స్ అధికారులు ప్రాథమిక సమాచారం సేకరించారు.

ఆలూరు కుర్రాడు.. చైనాలో మెరిశాడు

■ పల్లె నుంచి అంతర్జాతీయ స్థాయికి ■ సెపక్‌తక్రాలో సత్తా చాటిన మధు

ఆలూరు, న్యూస్‌టుడే: అసలే కరవు ప్రాంతం.. వలసలకు పెట్టింది పేరు. అలాంటి పల్లెల ఎల్లలు దాటి చైనాలో సత్తాచాటాడు. నాన్నకు పనుల్లో సాయంగా ఉంటూనే.. మైదానంలో ఆటల సాధన చేశాడు. తెలుగు రాష్ట్రాల నుంచి ఎంపికైన ఒకే ఒక్కడు ఆ కుర్రాడు. జీవన శైలిని ప్రణాళికతో మలచుకుని, తన ఇష్టమైన క్రీడలో రాణిస్తున్నాడు.



చైనాలో మేనేజరు, కోచ్‌లతో భారత ఆటగాళ్లు

నాన్నకు సాయంగా ఉంటూనే..

ఆలూరు పట్టణానికి చెందిన బసవ రాజు, సరస్వతి దంపతులది మధ్య తరగతి కుటుంబం. పట్టణంలోని జాతీయ రహదారి పక్కన చిన్నపాటి దుకాణంలో రోజూ సాయంత్రం వేళ ఫాస్టుఫుడ్ తయారు చేస్తారు. అదే వీరికి జీవనాధారం. ఉన్నదాంట్లోనే ఇద్దరు కుమారులను మంచి చదువులు చదివించారు. పెద్ద కుమారుడు మధు చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకున్నాడు. పాఠశాల స్థాయి నుంచే వ్యాయామ ఉపాధ్యాయుల శిక్షణలో సెపక్‌తక్రాలో పట్టు సాధించాడు. తల్లిదండ్రులు కూడా ప్రోత్సహించారు. గల్లీ నుంచి అంతర్జాతీయ స్థాయికి ఎదిగాడు. చిన్నప్పుడు మొదలైన ఆట డిగ్రీ చదువుతున్నా ఆపలేదు. తండ్రి నిర్వహిస్తున్న గోబీ తయారీలో సాయమందిస్తూనే.. తాను క్రీడా సాధన చేసేవాడు.

అంతర్జాతీయ స్థాయి పోటీల్లోనూ సత్తా

జిల్లాలో వెనుకబడిన ఆలూరు నియోజకవర్గం నుంచి సెపక్‌తక్రా పోటీల్లో అంతర్జాతీయ స్థాయిలో పాల్గొన్న మొదటి క్రీడాకారుడిగా మధు నిలిచాడు. మధు ఇప్పటి వరకు 20 సార్లు రాష్ట్ర, 15 సార్లు ఆంధ్ర జట్టు తరఫున జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్నాడు. జాతీయ స్థాయిలో 15 సార్లు ఆంధ్ర జట్టుకు కెప్టెన్‌గానూ వ్యవహరించాడు. సారథిగానే కాకుండా ఆటగాడిగానూ ఉత్తమ ప్రదర్శన కనబరిచి జాతీయ స్థాయి పోటీల్లో తమ జట్టు విజయాలకు కీలకంగా వ్యవహరించాడు. ఆంధ్రప్రదేశ్‌తో పాటు హిమాచల్ ప్రదేశ్, అస్సోం, కర్ణాటక, తెలంగాణ, బిహార్, తమిళనాడు, గోవా వంటి రాష్ట్రాల్లో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటి పలు మార్లు బంగారు, కాంస్య పతకాలు, ప్రశంసా పత్రాలు, షీల్డులు అందుకున్నాడు.

మూడో స్థానంలో నిలిచి..

తాజాగా దిల్లీలో ఆగస్టు 11న జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటి అంతర్జాతీయ పోటీలకు ఎంపికయ్యాడు. సెప్టెంబరు 18 నుంచి 23వ తేదీ వరకు చైనాలోని కింగ్ డావోలో జరిగిన అంతర్జాతీయ స్థాయి ఏషియన్ బీచ్ సెపక్‌తక్రా చాంపియన్‌షిప్ పోటీల్లో పలు రాష్ట్రాలకు చెందిన ఐదుగురితో పాటు మధు భారత జట్టు తరఫున పాల్గొని ప్రతిభ చాటాడు. భారత జట్టు సెమీ ఫైనల్ వరకు వెళ్లడంలో కీలకంగా వ్యవహరించారు. అంతర్జాతీయ స్థాయి పోటీల్లో ఓ మ్యాచ్‌కు కెప్టెన్‌గా సైతం వ్యవహరించారు. భారత జట్టు చైనా, ఇరాక్, కొరియా జట్లపై విజయం సాధించింది. సెమీ ఫైనల్‌లో థాయల్‌లాండ్ జట్టు చేతిలో పరాజయం పొంది అంతర్జాతీయ స్థాయిలో మూడో స్థానంలో నిలిచారు. దాంతో జట్టులో సభ్యుడైన మధు కాంస్య పతకం అందుకున్నాడు.



మధు, సెపక్‌తక్రా క్రీడాకారుడు



పంచాయతీరాజ్ ఎస్‌ఈ రామచంద్రారెడ్డికి అభినందనలు తెలుపుతున్న ఇంజినీర్లు, ఉద్యోగులు

పంచాయతీరాజ్ ఎస్‌ఈ బాధ్యతల స్వీకరణ

కర్నూలు నగరం, న్యూస్‌టుడే : పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ కర్నూలు సర్కిల్ పర్యవేక్షక ఇంజినీరు (ఎస్.ఇ.)గా వి.రామచంద్రారెడ్డి శుక్రవారం జడ్పీలోని సర్కిల్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. కడపలో ఈఈగా విధులు నిర్వహిస్తున్న ఆయనకు ఎస్‌ఈగా పదోన్నతి కల్పించి కర్నూలుకు బదిలీ చేశారు. ఆయనకు ఈఈలు మద్దన్న, రామకృష్ణారెడ్డి, డీఈఈలు తదితరులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్‌ఈ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు తనవంతు బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తిస్తానని చెప్పారు. అనంతరం ఆయన కలెక్టర్ రంజిత్ బాషాను మర్యాదపూర్వకంగా కలిశారు.

● చేనేత జౌళీ శాఖ ఉమ్మడి జిల్లా సహాయ సంచాలకులు (ఎ.డి.)గా జి.నాగరాజరావు కలెక్టరేట్‌లోని ఏడీ కార్యాలయంలో శుక్రవారం బాధ్యతలు చేపట్టారు.

జలవనరుల శాఖ ఈఈకి అభినందనలు

కర్నూలు జలమండలి, న్యూస్‌టుడే : జలవనరుల శాఖ పరిధిలోని కర్నూలు మైనరు ఇరిగేషన్ (ఎం.ఐ.) నూతన కార్యనిర్వాహక ఇంజినీరు (ఈఈ)గా జి.శ్రీనివాసులు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు డీఈఈలు జిలానీ, చెన్నకేశవనాయక్, సురేష్, ఏఈలు తదితరులు పుష్పగుచ్ఛమిచ్చి అభినందనలు తెలిపారు. కర్నూలు ఈఈ రెడ్డిశేఖర్‌రెడ్డి నూతన ఈఈ శ్రీనివాసులుకు బాధ్యతలు అప్పగించారు. శ్రీశైలం సీఅండ్‌బీలో ఈఈగా విధులు నిర్వహించిన జి.శ్రీనివాసులు ఎట్టకేలకు గతంలో తాను పనిచేసిన కర్నూలు ఎం.ఐ. స్థానం సాధించుకున్నారు.



కర్నూలు నూతన ఈఈ శ్రీనివాసులుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న డీఈఈ, ఏఈఈలు

రవాణా శాఖ ఆదాయం పెంచేలా కృషి

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే : జిల్లాలో ప్రమాదాల నివారణకు, రవాణా శాఖ నుంచి మరింత ఆదాయం పెంచేలా కృషి చేస్తామని రవాణా శాఖ ఉప కమిషనర్ శాంతకుమారి అన్నారు. ఆమె శుక్రవారం ఆర్టీవో కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఆమెతోపాటు రాయచోటి నుంచి బదిలీపై వచ్చిన భరత్ చౌహాన్ కర్నూలు ప్రాంతీయ రవాణాశాఖాధికారిగా బాధ్యతలు చేపట్టారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న శాంతకుమారి

29న మాస్టర్స్ అథ్లెటిక్స్ స్పోర్ట్స్ మీట్

కర్నూలు క్రీడలు (బి.క్యాంపు), న్యూస్‌టుడే : ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో 29వ తేదీ ఉదయం 8 గంటలకు ఉమ్మడి జిల్లా మాస్టర్స్ అథ్లెటిక్స్ స్పోర్ట్స్ మీట్ నిర్వహిస్తున్నట్లు మాస్టర్స్ అథ్లెటిక్స్ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రవికుమార్, పాండురంగారెడ్డి ఓ సంయుక్త ప్రకటనల్లో తెలిపారు. 30 నుంచి వందేళ్ల వయస్సు వారు పోటీల్లో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 98855 78905, 79893 28018 నంబర్లను సంప్రదించాలన్నారు.

కడప జిల్లాగానే కొనసాగించాలి

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే : వైఎస్సార్ పేరు తొలగించి మొదటినుంచి ఉన్న కడప జిల్లాగానే కొనసాగించేలా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి కోరారు. కర్నూలు జిల్లా పాత కల్లూరులోని వీరభద్రస్వామి దేవాలయంలో ఆయనతోపాటు బైరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి కలిసి శుక్రవారం పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బైరెడ్డి మాట్లాడుతూ ప్రజలను మోసం చేసేందుకే వైఎస్ జగన్ తిరుపతి పర్యటన చేస్తున్నారని ఆరోపించారు. హిందూ సంప్రదాయాలను దెబ్బతీశారని.. జగన్ హిందువుల ద్రోహి అని ధ్వజమెత్తారు. జగన్‌కు కులమే లేదని అన్నారు. నాస్తికులు, అన్యమతస్థులను నియమించి అపవిత్రం చేశారని తెలిపారు.

సుంకేసులకు 6,891 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

గూడూరు గ్రామీణం, న్యూస్‌టుడే: సుంకేసుల జలాశయానికి ఎగువ నుంచి 6,891 క్యూసెక్కుల వరద నీరు వస్తున్నట్లు జలాశయ ఇంజినీరు రాజు తెలిపారు. శుక్రవారం జలాశయంలో 1.235 టీఎంసీల నీరు నిల్వ ఉన్నాయన్నారు. ఒక గేటు ఎత్తి 6,891 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు వివరించారు.

నేడు హైకోర్టు న్యాయమూర్తి రాక

కర్నూలు న్యాయవిభాగం, న్యూస్‌టుడే : హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా పోర్టుపోలియో జడ్జి జస్టిస్ మన్మథరావు శనివారం కర్నూలు రానున్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి కబర్ధి అధ్యక్షతన నగరంలోని జిల్లా కోర్టులో జరిగే సమావేశానికి హాజరవుతారు. ఇందుకు సంబంధించి న్యాయశాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు.

వరద బాధితులకు రూ.లక్ష విరాళం

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: విజయవాడ వరద బాధితుల సహాయార్థం ఆదోనికి చెందిన



మంత్రి లోకేశ్‌కు చెక్కు అందజేస్తున్న గుడిసె కృష్ణమ్మ

తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గుడిసె ఆది కృష్ణమ్మ రూ.లక్ష విరాళం ప్రకటించారు. విజయవాడలో రాష్ట్ర మంత్రి నారా లోకేశ్‌ను శుక్రవారం కలిసి చెక్కు అందజేశారు. వరద బాధితుల కోసం అందరూ మానవత్వంతో ముందుకు రావాలని ఆమె కోరారు.

'మరే పాపం చేసేందుకు కొండెక్కాలనుకున్నావ్'

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి వాడటం దారుణమని.. కాసులకు కక్కుర్తి పడి ఇలాంటి దారుణాలకు పాల్పడ్డారని కర్నూలు పార్లమెంటు నియోజకవర్గ తెదేపా అధ్యక్షుడు పాలకుర్తి తిక్కారెడ్డి అన్నారు. మరే పాపం చేసేందుకు తిరుమల రావాలనుకున్నావంటూ జగన్‌ను నిలదీశారు. నగరంలోని పార్టీ కార్యాలయంలో తెదేపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, ఆలూరు నియోజకవర్గ బాధ్యుడు వీరభద్రగౌడ్‌తో కలిసి శుక్రవారం మాట్లాడారు. 16 నెలలు జైలులో గడిపిన నీవు బెయిల్‌పై బయట ఉన్నావని.. మరేపాపం చేసేందుకు కొండెక్కేందుకు సిద్ధమయ్యావ్ అని మండిపడ్డారు. దేశమంతా రాష్ట్రం వైపు చూస్తోందని.. వంద రోజుల్లో ఇది మంచి ప్రభుత్వం అంటూ ప్రజల చేత శభాష్ అనిపించుకుంటోందని చెప్పారు. శాంతియుతంగా ఉన్న రాష్ట్రంలో తిరిగి అలజడులు సృష్టించేందుకు జగన్ కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో తెదేపా నాయకులు చంద్రశేఖర్, సోమిశెట్టి నవీన్, మహేష్ గౌడ్, పి.హనుమంతరావు చౌదరి, సత్రం రామకృష్ణుడు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తిక్కారెడ్డి, పక్కన సోమిశెట్టి, వీరభద్రగౌడ్ తదితరులు

రావిపత్రం.. భగత్‌సింగ్ చిత్రం

ఆదోని మండలం అలసందగుత్తి జడ్పీ పాఠశాల విద్యార్థిని హిమవర్షిణి రావి ఆకుపై భగత్‌సింగ్ చిత్రాన్ని తీర్చిదిద్దింది. ఆకును క్రమపద్ధతిలో కత్తిరించి ఆయన రూపం మలిచింది. ఏడో తరగతి చదువుతున్న హిమవర్షిణి డ్రాయింగ్ ఉపాధ్యాయుడు కీర శిక్షణతో ఈ చిత్రాన్ని వేయగలిగానని చెబుతోంది. పాఠశాల ప్రధానోపాధ్యాయిని గిరిజాదేవి, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.

- న్యూస్‌టుడే, అలసందగుత్తి (ఆదోని గ్రామీణం)



విద్యార్థిని హిమవర్షిణి



విద్యుత్తు తరలింపు ఛార్జీల నిర్ధారణ

ఈనాడు, కర్నూలు, కర్నూలు (వెంకటరమణ కాలనీ), న్యూస్‌టుడే: ప్రైవేటు విద్యుత్తు ఉత్పత్తిదారులు డిస్కం లైన్లను ఉపయోగించుకున్నందుకు చెల్లించాల్సిన రుసుములను (వీలింగ్ ఛార్జెస్) ఏపీ విద్యుత్తు నియంత్రణ మండలి శుక్రవారం నిర్ధారించింది. వచ్చే ఐదేళ్ల వరకు ఇవి అమలులో ఉంటాయి. గతంలో కాంట్రాక్టెడ్ లోడ్ ప్రకారం విధించగా.. ఈ ఏడాది నుంచి యూనిట్ల ప్రాతిపదికన చెల్లించేలా అందుబాటులోకి తెచ్చారు. రాష్ట్రంలోని 3 పంపిణీ సంస్థల్లోనూ ఛార్జీలు ఒకేలా ఉండేలా చర్యలు తీసుకున్నారు. నూతన ఛార్జీలు అక్టోబరు ఒకటి నుంచి అమలులోకి వస్తాయి. 2029 వరకు సంవత్సరాల వారీగా చెల్లించాల్సిన రుసుముల వివరాలతో కూడిన బహుళ వార్షిక ఉత్తర్వులను విద్యుత్తు నియంత్రణ మండలి జారీచేసింది. పంపిణీ సంస్థలు ప్రతిపాదించిన మొత్తాలకన్నా 20% తగ్గించి ఛార్జీలు నిర్ధారించారు. గృహ, ప్రభుత్వ, సామాజిక అవసరాలకు ఉపయోగించే విద్యుత్తుకు 50% రాయితీ వచ్చేలా చర్యలు తీసుకున్నారు. తాజా విధానంపై డిస్కంలు, ఏపీ ట్రాన్స్‌కోలు తమ అభిప్రాయాలను 2 నెలల్లోపు పంపవచ్చని సూచించారు. దీంతో పాటు విద్యుత్తు నియంత్రణ మండలి ప్రతి డిస్కంకు సంబంధించి ఏటా రూ.15 కోట్లు ప్రజా భద్రత కోసం ఖర్చు చేసేందుకు ఆమోదం తెలిపింది.

29న వైద్య విజ్ఞాన సదస్సు

కర్నూలు వైద్యాలయం, న్యూస్‌టుడే : ప్రపంచ హృద్రోగ దినోత్సవాన్ని పురస్కరించుకొని హార్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కర్నూలు ఎ.క్యాంపులోని హెల్త్ క్లబ్‌లో 29న వైద్య విజ్ఞాన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆ ఫౌండేషన్ కార్యదర్శి డా.చంద్రశేఖర్ తెలిపారు. ఆ సాయంత్రం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సదస్సు ఉంటుందని చెప్పారు. కర్నూలు పెద్దాస్పత్రి సూపర్ స్పెషాలిటీ విభాగంలోని క్యాత్‌ల్యాబ్‌లో వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చిట్టినరసమ్మ, డా.లక్ష్మీబాయి, కార్డియాలజీ వైద్యులు ప్రశాంత్, కిరణ్‌కుమార్‌రెడ్డి, ఉదయబిందు, రవికిరణ్‌తో కలిసి శుక్రవారం మాట్లాడారు. తిరుపతి స్విమ్స్ వైద్య కళాశాల కార్డియాలజీ ప్రొఫెసర్ డా.రాజశేఖర్ ఆధ్వర్యంలో ఉదయం సదస్సు జరుగుతుందని పేర్కొన్నారు. సునయన ఆడిటోరియంలో జరిగే కార్యక్రమానికి ఎంపీ బస్తిపాటి నాగరాజు, కలెక్టర్ రంజిత్‌బాషా హాజరవుతారని చెప్పారు. వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చిట్టినరసమ్మ మాట్లాడుతూ కార్డియాలజీలో నూతన క్యాత్‌ల్యాబ్ అందుబాటులోకి రావడంతో రోగులకు యాంజియోగ్రామ్‌లు, స్టెంట్లు వేస్తున్నట్లు చెప్పారు.



వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చిట్టినరసమ్మకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న డా.చంద్రశేఖర్

తల్లడిల్లిన కన్నపేగు

దేవనకొండ, న్యూస్‌టుడే: చివరిదాకా తోడూనీడగా ఉంటాడనుకున్న భర్త దూరమయ్యారు. ఇద్దరు కుమారుల బాధ్యతను భుజాన వేసుకుని పెంచి పెద్దచేసింది. చిన్నపాటి దుకాణం నిర్వహిస్తూ.. చదివించింది. సాఫీగా సాగుతన్న జీవితంలో ప్రమాదం పెద్ద కుమారుడిని తీసుకెళ్లి.. విషాదం నింపింది. రెండో కుమారుడు ఆత్మహత్యకు పాల్పడి మరింత కుంగదీశాడు. తల్లి ఒంటరిగా మిగిలి తల్లడిల్లుతున్నారు. దేవనకొండ మండలం పి.కోటకొండ గ్రామానికి చెందిన జరీనా కుమారుడు షఫీ(24) శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడ్డారు. జరీనా భర్త 20 ఏళ్ల కిందట రహదారి ప్రమాదంలో మృతిచెందారు. తన ఇద్దరు కుమారులను పెంచి, ఇంటర్ వరకు చదివించారు. గ్రామంలో ఓ చిన్న కిరాణ దుకాణం నిర్వహిస్తూ.. జీవనం సాగిస్తున్నారు. మూడేళ్ల కిందట గోడ కూలి పెద్ద కుమారుడు మృతిచెందారు. ఉన్న ఒక్కగానొక్క కుమారుడు షఫీని అల్లారుముద్దుగా చూసుకుంటున్నారు. ఇంటర్ వరకు చదివి డ్రైవింగ్ నేర్చుకుంటున్నాడు. శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇది తెలిసిన ఆ తల్లీ గుండెవిలసేలా రోదించడం చూసి అక్కడివారు కన్నీటిపర్యంతమయ్యారు. భర్త, కుమారులు దూరమై జరీనా ఒంటరిగా మిగిలారు.

డెంగీపై అప్రమత్తంగా ఉండాలి

గోనెగండ్ల, న్యూస్‌టుడే: డెంగీ కేసులపై ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి డాక్టరు భాస్కర్ వైద్య సిబ్బందికి సూచించారు. గోనెగండ్ల మండలం కైరవాడి గ్రామంలో శుక్రవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం సిబ్బంది ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని పరిశీలించారు. రోగాలు వ్యాపించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని గ్రామస్థులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కార్తీక్, వైద్య సిబ్బంది హనుమంతు, సుధాకర్, పరమేష్, భారతి, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.




వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి భాస్కర్

పోలీసుల అదుపులో గజదొంగ

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : కర్నూలులో గజదొంగను పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. తెలివిగా తప్పించుకుంటూ తాళం వేసిన ఇళ్లలో దోచుకునేవాడు. ఇతనికి వేర్వేరు కాలనీలకు చెందిన మరో నలుగురు సహకరించినట్లు తెలిసింది. నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా పదుల సంఖ్యలో ఇళ్లలో దొంగతనాలకు పాల్పడ్డామని ఒప్పుకొన్నట్లు తెలిసింది. ఒక్క కర్నూలు నాలుగో పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలోనే 20 ఇళ్లలో చోరీలకు పాల్పడినట్లు సమాచారం. అర కిలో పైగానే బంగారు ఆభరణాలను పోలీసులు రికవరీ చేసినట్లు తెలిసింది.

రహదారి ప్రమాదంలో రైతు దుర్మరణం

ఆస్పరి, న్యూస్‌టుడే: పొలంలో పత్తి పంట కోతకు కూలీల కోసం వెళ్లిన రైతు రహదారి ప్రమాదం మృతిచెందిన ఘటన చెన్నంపల్లిలో శుక్రవారం జరిగింది. కైరుప్పల గ్రామ పంచాయతీ పరిధిలోని మాజరా గ్రామమైన చెన్నంపల్లి గ్రామానికి చెందిన సుధాకర్(33) తనకున్న మూడు ఎకరల పొలంలో పత్తి సాగు చేశారు. శుక్రవారం ఉదయం పొలంలో పత్తి కోసేందుకు కూలీల కోసం ద్విచక్రవాహనంపై కైరుప్పలకు వెళ్తుండగా.. చెరువు కట్ట ములుపు వద్ద ప్రమాదవశాత్తో అదుపుతప్పి కిందపడ్డారు. తలకు బలమైన గాయం కావడంతో వెంటనే స్థానిక ఓ ప్రైవేట్ వైద్యుని దగ్గరకు తీసుకెళ్లారు. అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య సరస్వతి, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. రైతు మృతితో ఆ కుటుంబం పెద్దదిక్కును కోల్పోయింది.



సుధాకర్

అప్పుల బాధతో ఆత్మహత్య

వెల్దుర్తి, న్యూస్‌టుడే: మండలంలోని రామళ్లకోట గ్రామానికి చెందిన రైతు హనుమంతు(43) అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నారు. తనకున్న 4 ఎకరాల పొలంతో పాటు, మరో ఆరు ఎకరాలు కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నారు. మూడేళ్లుగా ఆశించిన స్థాయిలో పంట దిగుబడులు రావడం లేదు. పొలం సాగు, కుటుంబ అవసరాల కోసం రూ.8లక్షల మేర అప్పులు చేశారు. ఈ నెల 23న ఇంటి మిద్దెపై పురుగుల మందుతాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డారు. కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం కర్నూలుకు తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం ప్రాణాలు వదిలారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

హత్య కేసులో కప్పట్రాళ్ల బొజ్జమ్మకు విముక్తి

కర్నూలు న్యాయవిభాగం, న్యూస్‌టుడే : కృష్ణగిరి పోలీసుస్టేషన్ పరిధిలో జరిగిన చెరుకులపాడు నారాయణరెడ్డి హత్య కేసులో 15వ నిందితురాలైన కప్పట్రాళ్ల బొజ్జమ్మకు విముక్తి కలిగిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి కబర్ధి శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. 2017, మే 21న జరిగిన హత్య కేసులో కప్పట్రాళ్ల బొజ్జమ్మ, పత్తికొండ ఎమ్మెల్యే శ్యాంబాబు, అప్పటి వెల్దుర్తి ఎస్సై నాగతులసీప్రసాద్‌ల పేర్లు ఎఫ్ఐఆర్‌లో చేర్చగా పోలీసుల దర్యాప్తులో వీరి పేర్లు తొలగించారు. నారాయణరెడ్డి భార్య, పత్తికొండ మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి డోన్ కోర్టులో పిటిషన్ దాఖలు చేసి నిందితుల జాబితాలో వీరి పేర్లను చేర్చారు. దీంతో శ్యాంబాబు, ఎస్సై నాగతులసీప్రసాద్‌లు వేర్వేరుగా హైకోర్టును ఆశ్రయించి క్వాష్ పిటిషన్ దాఖలు చేయగా 2018, డిసెంబర్ 31న వీరికి విముక్తి లభించింది. ఈ కేసులో కప్పట్రాళ్ల బొజ్జమ్మ 15వ నిందితురాలిగా కొనసాగుతుండగా కోర్టులో కేసు విచారణకు వచ్చింది. జిల్లా కోర్టులో బొజ్జమ్మ తరఫున న్యాయవాది చాంద్‌బాషా డిశ్ఛార్జి పిటిషన్ దాఖలు చేశారు. బొజ్జమ్మపై తగిన సాక్ష్యాధారాలు లేకపోవటంతో కేసు నుంచి ఆమెకు విముక్తి కలిగిస్తూ న్యాయమూర్తి ఆదేశాలు ఇచ్చారు.

ఆదోని

• ఆదోని • ఆలూరు • పత్తికొండ

పత్తికొండ డీఎస్పీకి ఎస్పీ అభినందన



పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: పత్తికొండ డీఎస్పీ వెంకట్రామయ్యను ఎస్పీ బిందుమాధవ్ ప్రశంసా పత్రంతో అభినందించారు. ఈ నెల 14న జరిగిన జాతీయ మెగా లోక్ అదాలత్‌లో పత్తికొండ సబ్ డివిజన్ పరిధిలోని ఎక్కువ కేసులు రాజీ మార్గం ద్వారా పరిష్కారానికి తీసుకున్న చర్యలకు గానూ జిల్లా ఎస్పీ ఆయనకు ప్రశంసా పత్రం అందజేసి అభినందించారు.

ఎస్పీ నుంచి ప్రశంసా పత్రం అందుకుంటున్న డీఎస్పీ వెంకట్రామయ్య.

వ్యాస రచన పోటీలు

దేవనకొండ, న్యూస్‌టుడే : దేవనకొండలోని ఉన్నత పాఠశాలలో మై విజన్-ఇన్ ఇండియా 2047, స్వర్ణాంధ్ర 2047 అనే వ్యాస రచన పోటీలు నిర్వహించారు. వ్యాస రచన పోటీల్లో వర్షిత్, సుమతి, మన్సూర్ అనే విద్యార్థులు గెలుపొందారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మద్దిలేటి, ఉపాధ్యాయిని ఉమాదేవీ, పాండురంగ విఠల్ పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
ఆదోని: 77996 66004
ఆలూరు: 80085 62277
పత్తికొండ: 8008573822

హొళగుంద, న్యూస్‌టుడే: **సమస్య:** స్థానిక ఈబీసీ కాలనీలో మురుగుకాల్వలో ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తచెదారంతో మురుగు పారక పోవడంతో దుర్వాసన, దోమల బెడదతో కాలనీ వాసులు ఇబ్బందికి గురి అవుతున్నాం.
– మంగయ్య, హొళగుంద

సమాధానం: పారిశుద్ధ్య సిబ్బందితో శుభ్రం చేయిస్తాం. – రంగమ్మ సర్పంచి, హొళగుంద

తుగ్గలి, న్యూస్‌టుడే: **సమస్య:** ఇటీవల కురిసిన భారీ వర్షాలకు జొన్నగిరి చిన్న జొన్నగిరి గ్రామాల మధ్యన వాగుపై ఉన్న వంతెన సగ భాగం దెబ్బతిని వాహనాలు రాకపోకలకు చాలా ఇబ్బందిగా ఉంది. వంతెన నిర్మాణం చేపట్టి వాహనదారులు, రైతులు ఇబ్బందులు తీర్చాలి.
– మల్లయ్య, జొన్నగిరి

సమాధానం: జొన్నగిరి వద్ద వాగుపై దెబ్బతిన్న వంతెన విషయం మా దృష్టికి వచ్చింది. మండల పరిషత్ నిధులతో వంతెన మరమ్మతు పనులు చేయిస్తాను.
– ఎర్రనాగప్ప, ఇంచార్జ్ ఎంపీపీ తుగ్గలి

ఆస్పరి, న్యూస్‌టుడే: **సమస్య:** ములుగుందం నుంచి కారుమంచి వరకు గరుసు రహదారి గుంతలు ఏర్పడి అధ్వానంగా ఉంది. ఆస్పరికి వెళ్లేందుకు దగ్గర దారి ఇది. మరమ్మతులు చేయాలి.
– హనుమంతు, ములుగుందం

సమాధానం: రహదారి మరమ్మతులకు ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరైన వెంటనే పనులు చేయిస్తాం.
– యమునప్ప, పీఆర్ఏఈ, ఆస్పరి

అనాథ బాలికలకు ఆర్థిక సాయం

ఆలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: హాలహర్వి మండలం గూళ్యం గ్రామంలో తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులకు న్యాయవాది, చిప్పగిరి మండల కన్వీనరు షేక్షావలి రూ.50వేలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి బాండును అందజేశారు. గ్రామానికి వెళ్లి బాలికలకు బాండును శుక్రవారం అందించారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వినతి

ఆదోని పురపాలకం, న్యూస్‌టుడే: ఆదోని పురపాలక సంఘం పరిధిలో పనిచేస్తున్న ప్రజారోగ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజయ్‌బాబు నేతృత్వంలో పురపాలక కమిషనర్ కృష్ణకు శుక్రవారం వినతిపత్రం అందించారు. కార్మికులకు సమదుస్తులు, కాస్మోటిక్స్ అందించాలన్నారు. పొరుగు సేవల కార్మికులను శాశ్వత కార్మికులుగా గుర్తించాలన్నారు. అనంతరం కొత్తగా బాధ్యతలు చేపట్టిన కమిషనర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి ఓ.బీ.నాగరాజు, పట్టణ అధ్యక్షులు వెంకన్న, కార్యదర్శి భీమేష్, కల్లుబావిరాజు, జయరాజ్, జాన్ బాబు, లక్ష్మణ తదితరులు పాల్గొన్నారు.

ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షికి తాఖీదులు

చిప్పగిరి, న్యూస్‌టుడే: తిరుమలకు వెళ్లకుండా చిప్పగిరి పోలీసులు ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షికి ఎస్సై రమేశ్‌బాబు శుక్రవారం తాఖీదులు ఇచ్చారు. ప్రస్తుతం తిరుపతిలో జరుగుతున్న పరిణామాల దృష్ట్యా తిరుపతికి వెళ్ల వద్దని తాఖీదులు జారీ చేశారు. ఎమ్మెల్యేతో పాటు ఆయన సోదరులు శ్రీరాములు, వెంకటేష్, ఎంపీపీ జూటూరు హేమలత, మండల కన్వీనర్ మారయ్య, కోఆప్షన్ సభ్యుడు సర్వార్ ఖాన్, చిప్పగిరి మల్లికార్జున, ఓబులేష్, నాగప్పకు తాఖీదులు అందజేశారు.

దాడి చేసిన వారిని శిక్షించాలి

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: పెద్దకడబూరు మండలం కల్లుకుంట గ్రామంలో దళిత మహిళపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆనంద్‌బాబు డిమాండు చేశారు. ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట శుక్రవారం కేవీపీఎస్, దళిత ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. నాయకులు వెంకటమ్మ, లక్ష్మణ్, కృష్ణ, కరుణాకర్, విజయమ్మ, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, రాజు మాట్లాడారు.

రాయితీ శనగ విత్తనాలు అందజేయాలి

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: రబీలో నల్ల రేగడి భూముల్లో సాగు చేసేందుకు అవసరమైన శనగ విత్తనాలను 50శాతం రాయితీతో సకాలంలో అందజేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి డి.రాజాసాహెబ్, తాలుకా ప్రధాన కార్యదర్శి పెద్దవీరన్న ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అక్టోబర్ మొదటి వారం నుంచి రబీ సీజన్ ప్రారంభమవుతుండటంతో రైతులు శనగ విత్తనాల కోసం ఎదురు చూస్తున్నారన్నారు. రైతు సంఘం గౌరవ అధ్యక్షుడు కారన్న, నాయకులు లక్ష్మన్న, శీను, ఈరన్న తదితరులతో కలిసి శుక్రవారం పత్తికొండ తహసీల్దారు కార్యాలయ అధికారికి వినతి పత్రం అందజేశారు.

కోట్ల విజయభాస్కరెడ్డికి నివాళి

ఆదోని ఎస్కేడీ కాలనీ, న్యూస్‌టుడే: ఆదోని పట్టణంలో దివంగత మాజీ ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా శుక్రవారం నివాళి అర్పించారు. స్థానిక కోట్ల కూడలిలో కోట్ల విజయభాస్కర్‌రెడ్డి విగ్రహానికి సీనియర్ నాయకులు సోమశేఖర్‌రెడ్డి, నీలకంఠప్ప, దేవిశెట్టి ప్రకాశ్, నసీరుద్దీన్‌పటేల్, సూగూరప్ప తదితరులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

చిన్నహుల్తిలో చోరీ

చిన్నహుల్తి(పత్తికొండ గ్రామీణం), న్యూస్‌టుడే: పత్తికొండ మండలం చిన్నహుల్తిలో రెవెన్యూ ఉద్యోగి రంగస్వామి ఇంట్లో శుక్రవారం చోరీ జరిగినట్లు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటి తలుపులు పగులగొట్టి ఇంట్లోని పది తులాల బంగారం, ఇతర వెండి ఆభరణాలను దొంగలు ఎత్తుకెళ్లినట్లు బాధితులు తెలిపారు. సమాచారం అందుకున్న పత్తికొండ సీఐ జయన్న హుటాహుటిన ఘటన జరిగిన ఇంటి వద్దకు చేరుకొని విచారణ చేపట్టారు. ఇంటి యజమాని విధుల నిమిత్తం వెళ్లగా ఆయన భార్య పొలానికి వెళ్లింది. ఇంటి తాళాలు పగులగొట్టి ట్రంకుపెట్టెలో దాచిన ఆభరణాలు దోచుకెళ్లారు. సాయంత్రం ఇంటికి వెళ్లేసరికి తలుపులు పగులగొట్టిన విషయాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు విచారణ చేపట్టినట్లు సీఐ తెలిపారు. జాగిలాలు, క్లూస్‌టీంను రప్పించి వివరాలు సేకరిస్తున్నట్లు ఆయన చెప్పారు.

ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి

వెల్దుర్తి, న్యూస్‌టుడే: వెల్దుర్తి సమీపంలోని 44వ జాతీయ రహదారిలోని ప్రైవేటు గ్రానైట్ పరిశ్రమ వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో 55 ఏళ్ల వ్యక్తి మృతి చెందారు. గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అతడిని డోన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందారు. ఇతని ఆచూకి తెలిసిన వారు తమకు సమాచారం అందించాలని ఎస్సై అశోక్ తెలిపారు.

కర్ణాటక మద్యం స్వాధీనం.. ఇద్దరి అరెస్ట్

ఆలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: కర్ణాటక మద్యం అక్రమ సరఫరా చేస్తున్నారనే సమాచారం మేరకు దాడులు చేసి మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ఆలూరు సీఐ శ్రీనివాస్ నాయక్, ఎస్సై వెంకట నరసింహులు తెలిపారు. హాలహర్వి మండలం మాచనూరు గ్రామానికి చెందిన ఉదయ్ కుమార్, ఆలూరుకు చెందిన ఈడిగ నరసింహులుకు మద్యం అందిస్తుండగా దాడిచేసి పట్టుకున్నట్లు చెప్పారు. వారి నుంచి 384 టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి, ఇద్దరిని అరెస్టు చేశామని తెలిపారు.

పనిచేయని యంత్రం.. గొంతు దిగని జలం

◆ పాఠశాలల్లో పనిచేయని ఆర్వో ప్లాంట్లు
◆ విద్యార్థులకు కుళాయి నీరే దిక్కు



పాఠశాలలో పురపాలక కుళాయి నీటిని తాగుతున్న విద్యార్థులు

ఆదోని విద్య, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు శుద్ధ జలం అందడం గగనంగా మారింది. గత ప్రభుత్వం నాడు-నేడు పథకం కింద ఆయా పాఠశాలల్లో ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేసింది. ఇంతవరకు బాగానే ఉన్నా.. ఆ తర్వాత గత రెండేళ్లుగా ఆర్వో ప్లాంట్ల నిర్వహణను గత ప్రభుత్వం గాలికొదిలేసింది. ఆదోని డివిజన్ పరిధిలోని చాలా పాఠశాలల్లో ఈ ఆర్వో ప్లాంట్లు పని చేయకపోవడంతో దిష్టిబొమ్మల్లా మారాయి. ఫలితంగా విద్యార్థులు కుళాయిలు, బోరు నీటిని తాగాల్సిన పరిస్థితి ఏర్పడింది.

విద్యుత్తు సమస్యతో అలంకారప్రాయంగా..

ఆదోని పట్టణంలోని నెహ్రూ మెమోరియల్ పురపాలక ఉన్నత పాఠశాలలో దాదాపు 2వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో నాడు-నేడు పథకం కింద రూ.లక్షలు వెచ్చించి పెద్ద ఆర్వో ప్లాంట్లు అమర్చారు. తర్వాత విద్యార్థులకు ఈ యంత్రంతో నీరు కూడా అందించారు. ఆ తర్వాత ప్లాంటుకు విద్యుత్తు సరఫరాలో సమస్య తలెత్తింది. చిన్న చిన్న మరమ్మతులు కూడా తోడవడంతో పని చేయడంలేదు. సుమారు రెండేళ్లుగా ఇది పని చేయకపోవడంతో విద్యార్థులు పురపాలక సంఘం సరఫరా చేసే తాగునీటి కుళాయిల ద్వారా వచ్చే నీటిని తాగాల్సిన పరిస్థితి నెలకొంది.



గదిలో పెట్టి తాళం వేశారు

ఆదోని పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 1400 మంది దాకా విద్యార్థినులు చదువుతున్నారు. ఈ పాఠశాలలో నాడు- నేడు మొదటి విడత కింద రూ.లక్షలు వెచ్చించి తాగునీటి ఆర్వో ప్లాంటును ఏర్పాటు చేశారు. అప్పటి పాఠశాల నిర్వాహకుల నిర్లక్ష్యం కారణంగా విద్యార్థులు చదువుతున్న తరగతి గదులకు దూరంగా పాఠశాల ఆవరణలో ఉన్న ఓ గదిలో అమర్చడం ద్వారా విద్యార్థినులకు ఈ ఆర్వో ప్లాంటు దూరం కావడంతో ఈ నీటిని వినియోగించలేకపోతున్నారు. పురపాలక సంఘం సరఫరా చేసే తాగునీటిని తాగుతున్నారు. ఫలితంగా ఈ ఆర్వో ప్లాంటు తాళం వేసిన గదిలోనే దిష్టిబొమ్మలా మారింది.



ప్రతి కుటుంబం స్వచ్ఛతను పాటించాలి

మద్దికెర, న్యూస్‌టుడే: పరిసరాల పరిశుభ్రతతో పాటు, ప్రతి ఇంటిని స్వచ్ఛంగా ఉంచుకోవాలని ఎంపీపీ అనిత, ఎంపీడీవో స్వర్ణలత, ఈవోపీఆర్డీ మద్దిలేటిస్వామి, సర్పంచి సుహాసిని, పంచాయతీ కార్యదర్శి శివకుమార్, జడ్పీటీసీ మాజీ సభ్యుడు రాజన్న, తెదేపా నాయకులు ధనుంజయ, చంద్రశేఖరగౌడ్ తదితరులు పేర్కొన్నారు. మద్దికెర మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం 17,498 చెత్తబుట్టలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బొమ్మనపల్లి సర్పంచి ఆంజనేయులు, ఎంపీటీసీ సభ్యుడు ఆంజనేయులు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



స్థానికులకు చెత్త బుట్టలను అందిస్తున్న అధికారులు, నాయకులు

సత్య ఏజెన్సీ షోరూమ్ ప్రారంభం

ఆదోని సాంస్కృతికం, న్యూస్‌టుడే : ఆదోని పట్టణంలోని మున్సిపల్ మెయిన్ రోడ్డులో శుక్రవారం సత్య ఏజెన్సీ 35వ షోరూమ్‌ను ప్రారంభించారు. సత్య ఏజెన్సీ రాష్ట్ర హెడ్ సెంథిల్ ఆధ్వర్యంలో భవనం యజమానులు రవితేజ, సుబ్బయ్య రిబ్బన్‌కట్ చేసి షోరూమ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా సెంథిల్ మాట్లాడుతూ.. షోరూమ్‌లో వినియోగదారుల కోసం అన్ని కంపెనీల ఎలక్ట్రానిక్స్ సామగ్రి అందుబాటులో ఉంచామన్నారు. వినియోగదారులు వినియోగించుకోవాలని కోరారు.



ఆదోనిలో సత్య ఏజెన్సీ షోరూమ్‌ను ప్రారంభిస్తున్న అతిథులు

అన్నదాత సుఖీభవ



ఆదోని మార్కెట్, న్యూస్‌టుడే: ఆకలి బాధలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి చంద్రబాబు అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేస్తున్నారని ఎమ్మెల్యే పార్థసారథి అన్నారు. ఆదోని మార్కెట్ యార్డులో ఇస్కాన్ సంస్థ ఆధ్వర్యంలో మార్కెట్ యార్డు నేతృత్వంలో రూ.5లకే రైతులకు రాయితీ భోజన పథకాన్ని ఎమ్మెల్యే శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో యార్డు కార్యదర్శి రామ్మోహన్‌రెడ్డి, డీఈ సుబ్బారెడ్డి, పార్టీ నాయకులు నాగరాజుగౌడ్, ఉపేంద్ర, వ్యాపారులు, కమీషన్ ఏజెంట్లు పాల్గొన్నారు.

టమాటా పంట పండింది

✦ రెండు బాక్సులు ధర రూ. 1920



ఆస్పరి, న్యూస్‌టుడే: టమాటాకు భలే గిరాకీ పెరిగింది. ఆస్పరి, బిల్లేకల్లు మార్కెట్లలో టమాటా అధికంగా రైతులు అమ్మకానికి తెస్తున్నారు. టమాటా గంపలు, బాక్సులతో మార్కెట్లు కళకళలాడుతున్నాయి. 45కిలోల నుంచి 50 కిలోల జత బాక్సు రూ.1500 నుంచి రూ.1950 వరకు ధర పలుకుతోంది. జత టమాటా గంపలు (25కిలోల పైన) రూ.600 నుంచి రూ.900 వరుకు ఉంటోంది. రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పచ్చిమిరప కాయలు తప్ప అన్ని కూరగాయలు ధర పెరిగాయని స్థానిక వ్యాపారులు పేర్కొంటున్నారు. ఇక్కడ కొనుగోలు చేసిన కూరగాయలు హైదారబాద్, కర్ణాటక, బెంగళూరు, శివమొగ్గ, జడ్చర్ల ఇతర ప్రాంతాలకు తరలిస్తునట్లు వ్యాపారులు తెలిపారు. 20 రోజుల కిందట కురిసిన వర్షాలకు టమాటా మొక్కలు పూర్తిగా దెబ్బతిన్నాయి. శుక్రవారం రాత్రి ఆస్పరి, బిల్లేకల్లు మార్కెట్లలో గరిష్ఠంగా జత టమాటా బాక్సులు రూ.1920 పలికినట్లు వ్యాపారులు పేర్కొన్నారు.

రెండేళ్లు.. వెలగని దీపాలు



పత్తికొండ, న్యూస్‌టుడే: పత్తికొండ మండలంలోని కోతిరాళ్ల గ్రామంలో శివారు ప్రాంతంలోని కుటుంబాలు వీధి దీపాలు లేక అవస్థలు పడుతున్నాయి. శిథిలమైన విద్యుత్తు స్తంభాలు తొలగించి, కొత్తవి ఏర్పాటు చేసిన అధికారులు తీగలు, వీధి దీపాలు ఏర్పాటు చేయకుండా అలాగే వదిలేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు. రెండేళ్లుగా చీకట్లోనే మగ్గిపోతున్నా సంబంధిత అధికారులకు పట్టడం లేదని గ్రామానికి చెందిన నాగరాజు తదితరులు ఆరోపిస్తున్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా తమ వీధిలో దీపాలు లేని ఖాళీ స్తంభాలే దర్శనమిస్తున్నాయని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

☛ ఈ విషయమై పత్తికొండ విద్యుత్తు ఏఈ నారాయణస్వామి దృష్టికి తీసుకెళ్లగా.. తీగలు మంజూరు కాగానే కోతిరాళ్ల గ్రామంలో సమస్య పరిష్కరించేందుకు విద్యుత్తు స్తంభాలకు తీగలు ఏర్పాటు చేస్తామన్నారు.

ఆరోగ్యమే మహాభాగ్యం



ఆదోని పాతపట్టణం, న్యూస్‌టుడే: త్రిదండి చిన్నజీయర్ స్వామి ఆశీస్సులతో బంగారంతో చేసిన స్వర్ణామృత ఔషధం చిన్నారుల్లో రోగ నిరోధక శక్తి పెంచుతుందని సంఘ అధ్యక్షుడు శ్రీనాథ్‌గుప్తా, సౌజన్యకర్త కాకుబాల్ నగేష్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఆవోపా, వామ్(వరల్డ్ ఆర్యవైశ్య మహాసభ) సంయుక్త ఆధ్వర్యంలో 289 చిన్నారులకు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో సభ్యులు రఘు, వెంకటేశ్వర్లు, ప్రతాప్‌ఈరన్నశెట్టి, ప్రసాద్‌రావు, రత్నయ్య, మమతాశ్రీ, శ్రీదేవి, రాణి, తులసి, పద్మశ్రీ, కవితా తదితరులు పాల్గొన్నారు.

అనధికార చట్టాలు అమలు చేస్తే సహించం

స్పందనకు వందనం

ఆదోని మార్కెట్, న్యూస్‌టుడే: ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఆచారం పేరుతో అనధికారిక చట్టాలు అమలు చేస్తే సహించేది లేదని ఎమ్మెల్యే పార్థసారథి అన్నారు. ఆదోని మార్కెట్ యార్డులో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఈ నెల 25న 'ఈనాడు'లో ప్రచురితమైన 'ప్రత్యక్ష అమ్మకం మాయం' అనే కథనానికి స్పందించి ఎమ్మెల్యే మాట్లాడారు. యార్డులో రైతులు అమ్మిన సరకుకు నగదు ఇవ్వాల్సిన చోట కమీషన్‌తో పాటు వడ్డీ పట్టుకోవడం ఏంటని యార్డు అధికారులను ఎమ్మెల్యే ప్రశ్నించారు. ఇది అనాదిగా వస్తున్న ఆచారమంటున్నారని అధికారులు వివరించారు. నేటి సాంకేతిక కాలంలోను ఆచారమని నూటికి రూ.1-2లు చొప్పున వడ్డీ పట్టుకోవడం ప్రత్యక్ష దోపిడి కాదా, ఇలాంటివి ఆపేందుకు ఏం చర్యలు తీసుకున్నారని గట్టిగా మాట్లాడారు. దీనిపై అసెంబ్లీలో సైతం ప్రస్తావిస్తానని, ఇకపై ఇలాంటి మానుకోవాలని హితవు పలికారు. ఇలా చేస్తున్న 15 మంది కమీషన్ ఏజెంట్లను గుర్తించి, లైసెన్సులు సస్పెండ్‌కు సిఫారసు చేశామని యార్డు కార్యదర్శి రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. ఇలాంటి ఘటనలకు పాల్పడుతుంటే, రైతులు ఎవరైనా తమకు నేరుగా ఫిర్యాదు చేయాలని యార్డు కార్యదర్శి తెలిపారు. కార్యక్రమంలో పత్తి వ్యాపార సంఘం నాయకులు వెంకట్రామిరెడ్డి, సోమశేఖర్‌గౌడ్, లక్ష్మణ్‌రావు, గుడిసె శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

ఆలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: విద్యార్థులంతా చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ఆలూరు సీఐ శ్రీనివాస్ నాయక్, ఎస్సై సీవీ నరసింహులు అన్నారు. ఆలూరులోని ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు చట్టాలపై, సైబర్ క్రైం, రోడ్డు ప్రమాదాలు, పోక్సో చట్టం గురించి శుక్రవారం విద్యార్థులకు వివరించారు. ఆయన మాట్లాడుతూ బాలురు, బాలికలను ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే వారు జైలుకు వెళ్లక తప్పదన్నారు. అందరు కలిసి మెలిసి సఖ్యతగా మెలగాలని సూచించారు.



మాట్లాడుతున్న సీఐ శ్రీనివాస్ నాయక్

కార్యక్రమంలో ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ రాఘవరావు, వైస్ ప్రిన్సిపల్ వీరేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ పత్రాలు పంపిణీ

దేవనకొండ, న్యూస్‌టుడే : మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలకు చెందిన 35 మంది విద్యార్థులకు ఎన్‌సీసీ ఏ గ్రేడ్ పత్రాలను జేసీవో జూనియర్ కమాండర్ అలోక్ కుమార్, ప్రధానోపాధ్యాయుడు మద్దిలేటి, సీటీవో పాండురంగ విఠల్ ఆధ్వర్యంలో ఎన్‌సీసీ విద్యార్థులకు పత్రాలను పంపిణీ చేశారు.

విజ్ఞాన దీపికలు గ్రంథాలయాలు

చిప్పగిరి, న్యూస్‌టుడే: విజ్ఞాన దీపికలు గ్రంథాలయాలని ఎమ్మెల్యే విరుపాక్షి అన్నారు. మండల కేంద్రమైన చిప్పగిరిలో రూ.20 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన గ్రంథాలయ భవనాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. గ్రంథాలయాల్లో లభించే పుస్తకాలను చదివి పోటీ పరీక్షలకు సిద్ధంగా కావాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ జూటూరు హేమలత, జూటూరు మారయ్య, మొలగవల్లి రామాంజనేయులు, సర్పంచి గోవిందరాజులు, గ్రంథాలయ జిల్లా కార్యదర్శి ప్రకాష్, డీఈఈ లక్ష్మీనారాయణ, ఎంఈవోలు సావిత్రి, లతీఫ్, గ్రంథాలయాధికారులు అబ్దుల్ రసూల్, విజయ భాస్కర్, మురళీధర్, బహీర్ అహ్మద్, రాఘవరెడ్డి, కృష్ణరెడ్డి, ఉమాకాంత్ స్వామి, ఏఈ మహేష్ పాల్గొన్నారు.



ప్రారంభోత్స సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విరుపాక్షి

ఇచ్చట పాటిద్దాం స్వచ్ఛత



ఆదోని పురపాలకం, న్యూస్‌టుడే: ఆదోని పట్టణ శివారులోని రాంజల చెరువు గట్టుపై పురపాలక సంఘం ఆధ్వర్యంలో స్వచ్ఛతాహి సేవ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో పురపాలక సంఘం కమిషనర్ కృష్ణతో పాటు ప్రజారోగ్య విభాగం కార్మికులు పాల్గొన్నారు. పిచ్చి మొక్కలు, ముళ్ల కంపలు తొలగించారు. శుభ్రత పనులు చేపట్టారు. ఉదయం నడకకు వెళ్లిన వారు స్వచ్ఛందంగా సేవ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పత్తి రైతుకు కష్టకాలం

◆ తడిసిన పత్తితో నష్టాలు ◆ తేమ శాతం పెరిగితే అంతే

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: అతివృష్టి, అనావృష్టి పరిస్థితులు రైతులను వెంటాడుతున్నాయి. సేద్యం గిట్టుబాటు కాక రైతులు అవస్థలు పడుతున్నారు. జులైలో చినుక జాడ కరవై పంటలు దెబ్బతిన్నాయి. సుమారు 50 రోజుల పాటు వర్షం లేక పంటలు బెట్టకు వచ్చాయి. ఆగస్టు ఆఖరులో వర్షాలు ఎక్కువయ్యాయి. వర్షాలకు కొద్దిగా పంటలు పుంజుకున్నాయి. పత్తి కాయలు పగిలి దిగుబడి చేతి కందే సమయంలో వారం రోజులుగా చినుకులు రాలుతున్నాయి.. కూలీలు దొరక్క రైతులు పొలాల్లో పత్తిని అలాగే వదలి పెట్టుకుంటున్నారు. చిన్నపాటి చినుకులకు పత్తి తడిసి తేమ శాతం పెరిగిపోయింది. తెంచిన తర్వాత అరబెట్టుకుంటున్నారు. రహదారులు, ఇంటి బయట ఆరేయక తప్పని పరిస్థితి. ఆదోని మండలం పాండవగల్, కుప్పగల్, పెద్దతుంబళం, బల్లెకల్, తదితర గ్రామాల్లో రైతులు అవస్థలు పడుతున్నారు. తడిసిన పత్తిని మార్కెట్ తీసుకుపోతే ధర తక్కువగా అడుగుతారు. ఇది రైతుల దయనీయ పరిస్థితి.



ఆదోని మండలం కుప్పగల్ గ్రామంలో ఇంటి ఎదుట ఆరబెట్టారిలా

ఆదోని ఉప డివిజన్‌లోని ఆదోని, కౌతాళం, కోస్గి, పెద్దకడబూరు మండలాల్లో సాధారణ సాగు 2,87,075 ఎకరాలు కాగా.. అందులో 1,90,945 ఎకరాలు సాగైంది. ఆదోని మండలంలో పత్తి సాధారణ సాగు 22,941 ఎకరాలు కాగా అందులో 21,816 ఎకరాలు సాగు చేశారు. దీంతో మార్కెట్‌లో పత్తి ధరలు తగ్గుముఖం పడుతున్నాయి. శుక్రవారం క్వింటాలు గరిష్ఠ ధర రూ.7,579 కాగ మధ్య ధర రూ.7,389 కనిష్ఠ ధర రూ.4211 పలికింది. తేమ శాతం ఎక్కువగా ఉంటే ఇంకా తక్కువ ధరకు సరకు అడుగుతున్నారని రైతులు వాపోతున్నారు.



ప్రధాన రహదారిపై ఆరబెట్టిన పత్తి

రెండు రోజులుగా అరబెట్టుకుంటున్నాం

– హరున్‌బాష, రైతు, పెద్దతుంబళం (ఆదోని)



ఐదు రోజుల కిందట చిన్న పాటి వర్షం కురవడంతో పత్తి తడిసి ముద్దయింది. పొలం నుంచి విడిపించిన పత్తిని రెండు రోజులుగా ఇంటి ముందు ఆరబెట్టుకుంటున్నాం. మార్కెట్‌కు ఇలాగే తీసుకెళ్తే తక్కువ ధర అడుగుతారు. ఏమి చేయాలో దిక్కుతోచక ఇబ్బందులు పడుతున్నాం. రెండు ఎకరాల్లో పత్తి సాగు చేశాం. రెండు నెలల కిందట వర్షం లేక పత్తి మొత్తం దెబ్బతింది. వచ్చిన కొద్దిపాటి దిగుబడులు కాపాడుకుందామంటే వారం రోజులుగా ఎండ లేక మేఘావృతం అయింది. రైతులను ఆదుకోవాలి.

ఎమ్మిగనూరు

• ఎమ్మిగనూరు • మంత్రాలయం • కోడుమూరు

రుణాలు మంజూరులో విఫలం

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: రుణాలు మంజూరు చేయడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని టౌన్ బ్యాంకు సభ్యులు భాస్కర్‌రెడ్డి, రంగన్న ఆరోపించారు. టౌన్ బ్యాంకు 79వ సర్వ సభ్య సమావేశాన్ని సీఈవో శిరీష అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. పలువురు సభ్యులు వివిధ అంశాలను లేవనెత్తారు. పదేళ్లుగా బ్యాంకులో ఉన్న పాత బకాయిలు ఎందుకు వసూలు చేయలేదని రామచంద్ర ప్రశ్నించారు. టౌన్ బ్యాంకులో ఇష్టారాజ్యంగా కొంతమంది బడా వ్యక్తులకే రుణాలు ఇస్తున్నారు తప్పా పేదలకు ఎందుకు అందడం లేదని ఆరోపించారు. అన్ని అప్పుల ఖాతాలు సక్రమంగా లేవని సభ్యులు ఆరోపించారు.



నిలదీస్తున్న సభ్యులు

సూపరింటెండెంట్‌గా సుధ

ఎమ్మిగనూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా సుధ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న సూపరింటెండెంట్ మైత్రేయు రోగుల ఆరోపణల నేపథ్యంలో ఉన్నతాధికారులు సస్పెన్షన్ చేసిన సంగతి తెలిసిందే. సుధ ప్రస్తుతం ఆసుపత్రిలో చిన్న పిల్లల వైద్యురాలిగా పని చేస్తున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
ఎమ్మిగనూరు (గ్రామీణం): 80085 73794
కోడుమూరు: 80085 73776

సి.బెళగల్, న్యూస్‌టుడే: **సమస్య:** ఇనగండ్ల బీసీ కాలనీలో రహదారిపై మురుగుతో అవస్థలు పడుతున్నాం.
-గురుస్వామి, ఇనగండ్ల

సమాధానం: సర్పంచి దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటాం. **-రాముడు, ఎంపీడీవో**

సమస్య: కొండాపురంలో రైతులు పొలాలకు సరఫరా చేసే విద్యుత్తు సరిగా అందడం లేదు.
-శంకరరెడ్డి, కొండాపురం

సమాధానం: సాధ్యమైనంత వరకు పగటి పూట రైతులకు విద్యుత్తు సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటాం. **-సుకుమార్, ఏఈ.**

సమస్య: ముడుమాల ఎస్సీ కాలనీలో బస్సు షెల్టరు మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకురావాలి.
-మారెప్ప, ముడుమాల

సమాధానం: త్వరలో మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తెస్తాం. **-రాముడు, ఎంపీడీవో**

సమస్య: కొండాపురం నుంచి ఇనగండ్ల వరకు మట్టి దారిని బీటీగా మార్చి రవాణా సదుపాయం కల్పించాలి.
-బి.వెంకటేశ్వర్లు, కొండాపురం

సమస్య: గాజులదిన్నె జలాశయం నుంచి టీబీపీ దిగువ కాలువ ద్వారా సి.బెళగల్ చెరువును నింపాలి.
-మధుస్వామి సి.బెళగల్

సమాధానం: ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటాం. **- రాముడు, ఎంపీడీవో, సి.బెళగల్.**

పెద్దకడబూరు, న్యూస్‌టుడే: **సమస్య:** మండలంలోని చిన్నకడబూరులో కాల్వలు శుభ్రం చేయలేదు. దీంతో కాల్వలు నిండి దుర్వాసన వెదజల్లుతోంది. రాత్రిపూట దోమల బెడద ఎక్కువైంది. **-గ్రామస్థులు, చిన్నకడబూరు.**

సమాధానం: గ్రామంలో నెలకొన్న సమస్యను గ్రామ కార్యదర్శి, సర్పంచి దృష్టికి తీసుకెళ్తాం. పంచాయతీలో నిధులను అనుసరించి పారిశుద్ధ్య నిర్మూలన చర్యలు చేపడతాం. **-జనార్దన్, ఇన్‌ఛార్జి ఎంపీడీవో, పెద్దకడబూరు.**

ఖోఖోలో జాతీయస్థాయికి ఎంపిక

కోసిగి, న్యూస్‌టుడే: కోసిగి జడ్పీ ఉన్నత బాలుర పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న బాలాజీ జాతీయ స్థాయి సబ్ జూనియర్ ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జలీల్ అహ్మద్ తెలిపారు. ఈ నెల 15న ప్రకాశం జిల్లా పంగులూరులో నిర్వహించిన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్స్ క్రీడల్లో రాణించి జాతీయ స్థాయి సబ్ జూనియర్స్ ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు శుక్రవారం వివరించారు. ఈ నెల 27వ తేదీ నుంచి అక్టోబర్ 1 వరకు ఝార్ఖండ్ రాష్ట్రంలో రాంచీలో జరిగే జాతీయ క్రీడల్లో బాలాజీ పాల్గొననున్నట్లు పేర్కొన్నారు.



ఎంపికైన బాలాజీ

రాష్ట్రస్థాయి పోటీలకు..

నందవరం, న్యూస్‌టుడే: నందవరం మండలంలో కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థిని జి.స్వాతి రాష్ట్రస్థాయి లాంగ్‌జంప్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ శైలజ, వ్యాయామ ఉపాధ్యాయురాలు శిరోమణి శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 26న జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో స్వాతి ప్రతిభ కనబరిచిందన్నారు.

గోనెగండ్ల, న్యూస్‌టుడే: ఆదర్శ పాఠశాలలో చదువుతున్న ఇంటర్ విద్యార్థులు హాకీ క్రీడలో రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ పద్మావతి తెలిపారు. శుక్రవారం పాఠశాల ఆవరణలో సభలో విద్యార్థులను ఆసిఫ్‌బాషా, బాబులు పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు. ఎస్‌జీఎఫ్ అండర్-19 విభాగంలో జిల్లా స్థాయిలో జరిగిన పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు పేర్కొన్నారు.



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

కబ్జాల పర్వం.. కనుమరుగైన వంకలు

• ముంపునకు గురవుతున్న కాలనీలు





చినుకుపడితే లోతట్టు ప్రాంతాల ప్రజలకు కంటి మీద కనుకు లేని పరిస్థితి నెలకొంది. పట్టణంలోని వంకలను కొందరు కబ్జా చేయడంతో వర్షం నీరు పారే పరిస్థితి లేదు. ఉన్న వంకల్లో ముళ్ల పొదలతో నిండిపోయి నీరు ముందుకు సాగని దుస్థితి. వంకలు అన్యాక్రాంతం కావడంతో లోతట్టు ప్రాంత కాలనీవాసులకు తిప్పలు తప్పడం లేదు. **- న్యూస్‌టుడే, ఎమ్మిగనూరు**

ఆదోని రహదారిలో 33 అడుగుల వంక ఉంది. వెంకటసాయి కాలనీ, ఇందిరా నగర్ కాలనీ, అయ్యప్ప గుడి వరకు ఈ వంకలో పోరంబోకు భూములు ఉన్నాయి. అక్కడక్కడ కొన్ని కట్టడాలు నిర్మించారు. 463 సర్వే నంబర్ భూమి పట్టాదారుడిది. వాస్తవంగా ఇక్కడ వంక పారేది. వాల్టా చట్టం ప్రకారం వంకను పూడ్చకూడదని నిబంధనలు ఉన్నాయి. భూమి యజమాని ఇతరులకు ప్లాట్లు వేసి విక్రయించారు. వర్షం నీరు పోయేందుకు రెండు అడుగుల స్థలం వదిలి డ్రైనేజీ నిర్మించారు. గతంలో అధికారులు వంక భూములను సర్వే చేసి గుర్తులు వేసి వదిలేశారు.

● క్విబుల్లా కాలనీలో 20 అడుగుల వెడల్పుతో వంక ఉండేది. ఇక్కడ కొందరు ఇళ్లు, మరుగుదొడ్లు నిర్మించుకోవడంతో వంక మూడు అడుగులయ్యింది. వర్షం వస్తే నీరంతా కాలనీల్లోకి చేరుతుంది.

● కర్నూలు రహదారిలో దాదాపు 30 అడుగుల వెడల్పు ఉన్న వంక వద్ద కొందరు పూరిళ్లు వేసుకొన్నారు. ప్రస్తుతం ఆ వంక పూర్తిగా కనుమరుగైంది. వంకలో కొందరు అక్రమంగా కట్టడాలు నిర్మించారు. దీంతో రూ. కోట్ల విలువ చేసే స్థలాలు కబ్జాకు గురయ్యాయి.

● శిల్పా వెనుక భాగంలో కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు వంకలను ఆక్రమించి స్థలాలను అమ్ముకొని సొమ్ము చేసుకొన్నారు. ఇవేకాక పట్టణంలోని దాదాపు ఎనిమిది వంకలు కనుమరుగయ్యాయి.

లక్ష్మణ్ టాకీస్ వెనుక కాలనీలో దాదాపు ఐదు వందల ఇళ్లు ఉన్నాయి. సుశీలమ్మ కొండ వంకను పూడ్చి వేయడంతో వంక నీరంతా కాలనీలోకి చేరుతున్నాయి. అన్నమయ్య కూడలిలో ఉన్న వంతెన మూసి వేసి అక్రమంగా ప్లాట్లు వేశారు. వర్షం పడితే కాలనీ అంతా కుంటలా మారుతుంది.

● వెంకటసాయి కాలనీ వద్ద 40 అడుగుల వెడల్పుతో వంక ఉండేది. రియల్ ఎస్టేట్ వ్యాపారులు ప్లాట్లు వేయడంతో వంక పూర్తిగా కనుమరుగైంది. ఇటీవల పురపాలక అధికారులు సర్వే చేశారు. సుమారుగా 15 అడుగుల పైగానే ఆక్రమించారని నివేదికలు సమర్పించారు. వంకలన్నింటిని రెడ్ మార్కు వేసి వదిలేశారు. రెవెన్యూ అధికారులు పూర్తిస్థాయిలో నివేదికలు ఇవ్వక పోవడంతో అలాగే వదిలేసి మమా అనిపించారు.

తక్షణమే చర్యలు తీసుకుంటాం - గంగిరెడ్డి, పురపాలక కమిషనర్

వంకల అన్యాక్రాంతంపై తక్షణమే చర్యలు తీసుకుంటాం. గతంలో సర్వేలు చేసిన వాటిపై పరిశీలిస్తాం. ఎవరైనా ఆక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాం.

స్వచ్ఛ గూడూరు సాధనే లక్ష్యం

గూడూరు గ్రామీణం, న్యూస్‌టుడే: పాలకులు, అధికారుల సహకారంతో ప్రజలకు ఉత్తమ సేవలు అందించడంతో పాటు స్వచ్ఛ గూడూరు నగర పంచాయతీ సాధనే లక్ష్యమని కమిషనర్ నాగరాజు పేర్కొన్నారు. కర్నూలు నగరపాలక సంస్థ నుంచి వచ్చిన ఆయన శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. అనంతరం సిబ్బందితో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. పారిశుద్ధ్యం, తాగునీటి సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు.

ఉద్యోగమేళాలో 33 మంది ఎంపిక



ఎంపికైన కళాశాల విద్యార్థులు

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: నైపుణ్యంతోనే ఉద్యోగాల్లో రాణించగలరని మహాయోగి లక్ష్మమ్మ అవ్వ డిగ్రీ కళాశాల ప్రధానాచార్యులు మహబూబ్ బాషా పేర్కొన్నారు. శుక్రవారం కళాశాలలో ఉద్యోగమేళాను నిర్వహించారు. ఇందులో 33 మంది విద్యార్థులు వివిధ కంపెనీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ కళాశాలలో చదువుతూ నైపుణ్య అభివృద్ధి సంస్థ శిక్షణతో ప్రతిభ సాధించి ఉద్యోగ మేళాలో వివిధ కంపెనీలకు ఎంపికై ఉద్యోగాలు సాధించడం ఎంతో గర్వకారణమన్నారు. విద్యార్థులు సాంకేతిక రంగంలో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. ప్రభుత్వ కళాశాలలో చదివిన విద్యార్థులకు ఎక్కడికి వెళ్లిన గుర్తింపు ఉంటుందన్నారు. నైపుణ్యాభివృద్ధి సంస్థ సమన్వయకర్త సుధాకర్, అశోక్, అధ్యాపకులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే: కోడుమూరు విద్యుత్తు శాఖ ఏఈగా మధుసూదన్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. కర్నూలు నుంచి ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న ఏఈ ఇస్మాయిల్ కర్నూలుకు బదిలీపై వెళ్లారు.

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే: కోడుమూరు సబ్ రిజిస్ట్రార్ తేజోవతిని సిబ్బంది, దస్త్రావేజులేకరులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమె పాణ్యం నుంచి వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న మహబూబ్‌బాషా డోన్‌కు బదిలీ అయ్యారు.

మంత్రాలయం, న్యూస్‌టుడే: రైతులకు రాయితీ విత్తనాలు అందజేయాలని సీపీఎం మండల కార్యదర్శి జయరాజు, నవ్యాంధ్ర ఎమ్మార్పీయస్ తాలుకా బాధ్యుడు దేవపుత్ర వ్యవసాయ అధికారి గణేశ్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు.

ఎమ్మిగనూరు వ్యవసాయం, న్యూస్‌టుడే: వ్యవసాయ మార్కెట్లో శుక్రవారం వేరుశనగ క్వింటా గరిష్ఠ ధర రూ. 7,170 మధ్యస్థం రూ. 6,470, కనిష్ఠం రూ. 2,671కు వ్యాపారులు కొన్నారు. మార్కెట్‌కు 3,516 వేరుశనగ బస్తాలు అమ్మకానికి వచ్చాయి. ఆముదాలు క్వింటా గరిష్ఠ ధర రూ. 5,740, మధ్యస్థం రూ. 5,730, కనిష్ఠం రూ. 4,830 పలికింది.

పెంచికలపాడు (గూడూరు గ్రామీణం), న్యూస్‌టుడే: మండల పరిధిలోని పెంచికలపాడు గ్రామానికి చెందిన ఎంపీటీసీ సభ్యుడు మద్దిలేటి శుక్రవారం పౌర సరఫరా సంస్థ కార్పొరేషన్ సభ్యుడు కొంకతి లక్ష్మీనారాయణను శుక్రవారం కలిశారు.

మంత్రాలయం గ్రామీణం(కౌతాళం), న్యూస్‌టుడే: ఐదేళ్ల వైకాపా పాలన చేసిన దాని కంటే.. కూటమి ప్రభుత్వం వంద రోజుల్లోనే ఎక్కువ అభివృద్ధి చేసిందని భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పురుషోత్తంరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కౌతాళంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

7 కి.మీ... 20 గుంతలు

పెద్దకడబూరు నుంచి ఆదోని వెళ్లే రహదారి అధ్వానంగా తయారైంది. గుంతలు పడటంతో చిన్న వర్షానికి నీళ్లు నిలిచి ప్రయాణీకుల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. పెద్దకడబూరు నుంచి రంగాపురం వరకు సుమారు 7 కి.మీ. మేర పూర్తిగా పాడైంది. పెద్దకడబూరు, చిన్నకడబూరు, రంగాపురం, కల్లుకుంట మేకడోన, జాలవాడి, కంబళదిన్నె గ్రామాల నుంచి వందల సంఖ్యలో వాహనాలు తిరుగుతుంటాయి. ఈ దారిపై సుమారు 20 చోట్ల గుంతలు ఏర్పడ్డాయి. రైతులు పండించిన దిగుబడులను ఆదోని వ్యవసాయ మార్కెట్‌కు తరలించేందుక నానా అవస్థలు పడాల్సివస్తోందని వాపోతున్నారు.

–న్యూస్‌టుడే, పెద్దకడబూరు



అల్లుకున్న నిర్లక్ష్యం

నందవరం మండల నదికైరవాడిలో తాగునీటి ట్యాంకులు అలంకారప్రాయంగా మారాయి. గ్రామంలో సుమారు 300 కుటుంబాలు ఉన్నాయి. జనాభాకు సరిపడా తాగునీరు అందక గ్యామంలో నీటి సమస్య పెరుగుతోంది. సమస్యను దృష్టిలో ఉంచుకొని సచివాలయం పక్కన మినీ వాటర్ ట్యాంకులను ఏర్పాటు చేశారు. నిర్లక్ష్యంగా వదిలేయడంతో నీటి ట్యాంకుల చుట్టూ పిచ్చి మొక్కలు అల్లుకుపోయి నిరుపయోగంగా మారాయి. సంబంధిత అధికారులు స్పందించి వాటిని వినియోగంలోకి తీసుకురావాలని గ్రామస్థులు కోరుతున్నారు.

–న్యూస్‌టుడే, నందవరం



ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడులు



రైతులకు సూచనలిస్తున్న శాస్త్రవేత్తలు

పెద్దకడబూరు, న్యూస్‌టుడే: ఆధునిక పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించ వచ్చని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త మౌనిక, కర్నూలు రైతు శిక్షణా కేంద్ర సహాయ వ్యవసాయ అధికారిణి హేమలత పేర్కొన్నారు. హనుమాపురం, పెద్దకడబూరులో ఉన్న రైతు సేవా కేంద్రాల్లో రైతు శిక్షణా కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. ప్రస్తుతం సాగు చేసిన మిరప, పత్తి, వేరుశనగ పంటల్లో తీసుకోవాల్సిన ఉత్తమ యాజమాన్య పద్ధతులపై రైతులకు వివరించారు. మండల వ్యవసాయాధికారి వరప్రసాద్, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రసాయన మందుల వాడకం తగ్గించాలి

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే: పంటలకు రసాయన మందుల వాడకం తగ్గించాలని మండల వ్యవసాయాధికారి రవిప్రకాశ్ సూచించారు. ప్యాలకుర్తిలో కంది, పత్తి, కూరగాయల పంటలను వ్యవసాయ సిబ్బంది శుక్రవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. రసాయన మందుల వాడకంతో భూసారం కోల్పోయి పంటల దిగుబడి తగ్గుతుందన్నారు. సేంద్రియ ఎరువులను వినియోగించాలన్నారు. కంది పంట పూత దశ మొదలవుతుండటంతో వేప నూనెను పిచికారీ చేయాలని రైతులకు సూచించారు.

నాణ్యమైన విద్యను అందించాలి

నందవరం, న్యూస్‌టుడే: విద్యార్థులకు క్రమశిక్షణ, నాణ్యతతో పాటు మంచి గుణాత్మక విద్యను అందించాలని మండల విద్యాధికారి సుదర్శన్‌రెడ్డి ఉపాధ్యాయులకు సూచించారు. మండల పరిధిలోని ఇబ్రహీంపురం, కొట్టాల గ్రామాల్లోని పాఠశాలలను శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజనాన్ని రుచికరంగా, మెనూ ప్రకారం విద్యార్థులకు అందించాలన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు మార్గదర్శకంగా ఉండాలన్నారు. విద్యార్థులకు సులభంగా, అర్థమయ్యే విధంగా బోధించాలన్నారు. పాఠశాల సిబ్బంది మధుకర్, మాణిక్యం పాల్గొన్నారు.

నేడు శ్రీమఠంలో నిత్య పూజలకు విరామం

మంత్రాలయం, న్యూస్‌టుడే: ఏకాదశి పురస్కరించుకుని శనివారం శ్రీమఠంలో నిత్య పూజలకు విరామం ఉంటుందని ఆలయ అర్చకులు తెలిపారు. నిజ బృందావన రూపంలో రాఘవేంద్రస్వామి దర్శనం కల్పించనున్నట్లు అర్చకులు శుక్రవారం వివరించారు. నిర్మాల్యం, కాషాయ వస్త్రాలు, తులసీ మాలతో బృందావనాన్ని అలంకరించనున్నారు. పంచామృతాభిషేకం, ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలకు రథోత్సవాలు, అన్నదానం, పరిమళ ప్రసాదాలు వితరణ ఉండదన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: పౌష్టికాహారంతో ఆరోగ్యంగా ఉంటారని పురపాలక కమిషనర్ గంగిరెడ్డి పేర్కొన్నారు. పట్టణంలో శిల్పా కాలనీలో ఉన్న సచివాలయంలో పౌష్టికాహార ఉత్సవాలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గర్భిణులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ అధికారి భాస్కర్‌రెడ్డి, సూపర్‌వైజర్ నీలమ్మ, మెప్మా అధికారి జయవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

కుల ధ్రువీకరణ పత్రాల జారీపై విచారణ

గూడూరు గ్రామీణం, న్యూస్‌టుడే: నగర పంచాయతీలో నీలి షికారీలు ఎస్టీ కుల ధ్రువ పత్రాలు ఇవ్వాలని తహసీల్దారు రామాంజనేయులకు వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు ఎంఆర్ఐ వరలక్ష్మి, వీఆర్వో సౌభాగ్య శుక్రవారం విచారణ చేపట్టారు. నీలి షికారీల ఇళ్ల వద్దకు వెళ్లి వారి జీవన పరిస్థితులు, గతంలో వారికి ఇచ్చిన కుల ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. గతంలో నాటుసారా తయారు చేస్తూ జీవించే వాళ్లమని ప్రస్తుతం వ్యవసాయ పనులకు వెళ్తున్నామని కుటుంబ పోషణ భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. పనులు దొరకని రోజుల్లో వేటకు వెళ్లి జీవనం సాగిస్తున్నామని వారు పేర్కొన్నారు. వివరాలను నమోదు చేసుకున్న రెవెన్యూ అధికారులు ఉన్నతాధికారులకు పంపుతామని చెప్పారు. నీలి షికారీల సంఘం మండలాధ్యక్షుడు విజయ్, సురేష్, మల్లేష్‌నాయుడు, మద్దిలేటి పాల్గొన్నారు.



విచారణలో పాల్గొన్న అధికారులు

పవన్ కల్యాణ్‌కు మద్దతుగా దీక్ష



రాఘవేంద్రకూడలిలో నియోజకవర్గ జనసైనికులతో కలసి దీక్ష చేస్తున్న జనసేన బాధ్యుడు బి.లక్ష్మన్న

మంత్రాలయం, న్యూస్‌టుడే: తిరుమల లడ్డూ కల్తీ విషయంలో ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టిన ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు మద్దతుగా దీక్ష చేస్తున్నట్లు మంత్రాలయం నియోజకవర్గ జనసేన బాధ్యుడు బి.లక్ష్మన్న పేర్కొన్నారు. శుక్రవారం నియోజకవర్గంలోని జనసైనికులతో కలిసి మంత్రాలయంలో ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం రాఘవేంద్ర కూడలిలో జనసైనికులతో కలిస దీక్ష చేశారు. లడ్డూ కల్తీకి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. జనసైనికులు బదినేహాహల్ చిన్నా, వీరారెడ్డి, లోకేశ్, రవిచంద్ర, రామకృష్ణ, నరసింహులు, బజారి, సుభాన్, గౌస్, అంజి, రాకేశ్ పాల్గొన్నారు.

వంద రోజుల సుభిక్ష పాలన

నందవరం, న్యూస్‌టుడే: వంద రోజుల్లోనే సుభిక్ష పాలన అందించామని తెదేపా రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడు ముగతి ఈరన్న గౌడ్ పేర్కొన్నారు. మండల పరిధిలోని ముగతి గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఇంటింటీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేస్తూ వంద రోజుల్లో కూటమి ప్రభుత్వం సాధించిన ప్రగతిని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ముగతి భార్గవ్ యాదవ్, సచివాయల సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో ఉన్నత స్థాయి



విద్యార్థులకు సూచనలు ఇస్తున్న డీఎస్పీ ఉపేంద్రబాబు

గోనెగండ్ల, న్యూస్‌టుడే: ప్రతి విద్యార్థి క్రమశిక్షణ అలవర్చుకుంటే జీవితంలో ఉన్నత స్థానానికి చేరుకోవచ్చునని ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్రబాబు సూచించారు. గోనెగండ్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో యాంటీ సోషల్ అక్టీవీటీస్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ హాజరై మాట్లాడుతూ.. పోటీ ప్రపంచంలో నెగ్గాలంటే పట్టుదల, క్రమశిక్షణ, కష్ట పడూతత్వం అలవర్చుకోవాలన్నారు. చెడు వ్యసనాలకు లోనై జీవితాలను పాడు చేసుకోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు నాగభూషణం, ఉపాధ్యాయులు భాస్కర్, అమానుల్లాబేగ్, ఉస్మాన్ పాల్గొన్నారు. సీఐ గంగాధర్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ పరిశుభ్రతను పాటించాలి



స్వచ్ఛతాహిసేవలో పాల్గొన్న విదార్థులు

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: పరిసరాల పరిశుభ్రతను ప్రతి ఒక్కరూ పాటించాలని ఎర్రకోట సెయింట్ జాన్స్ ఇంజినీరింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ సుధాకర్ సూచించారు. శుక్రవారం కడిమెట్ల గ్రామంలో కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థుల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఎమ్మిగనూరు పట్టణంలో ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంపై పట్టణంలో ర్యాలీ చేపట్టారు. ప్రిన్సిపల్ విజయరాణి, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ హరికుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: పరిసరాల పరిశుభ్రతను ప్రతి ఒక్కరూ పాటించాలని జిల్లా వైద్యాధికారి భాస్కర్ పేర్కొన్నారు. పట్టణంలోని శివన్ననగర్ కాలనీలో ఇంటింటికీ తిరిగి ప్రజలకు అవగాహన కల్పించారు. పట్టణ ఆరోగ్య కేంద్రాలను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలను శుభ్రం చేసుకోవాలన్నారు. నీటి నిల్వ ఉంటే దోమలు పెరిగి మలేరియా, డెంగీ, చికన్ గున్యా వ్యాధులను వ్యాప్తి చెందే అవకాశం ఉందన్నారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సమయ పాలన లేదు.. అందుబాటులో ఉండరు

కోసిగి, న్యూస్‌టుడే: సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించడం లేదు. విధి నిర్వహణలో పలుచోట్ల అలసత్వం ప్రదర్శిస్తున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉండాల్సిన సిబ్బంది క్షేత్రస్థాయికి వెళ్తున్నామని విధులకు డుమ్మా కొడుతున్నారు. గత వైకాపా పాలనలో సచివాలయాలన్నీ ఆ పార్టీ నాయకులతోనే నిండిపోయి వారి కనుసన్నల్లోనే పని చేసేవారని విమర్శలు ఉన్నాయి. చివరికి పార్టీ సమావేశాలు సైతం అక్కడే నిర్వహించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వచ్చినా కొందరు తీరు మారకపోవడంతో పలుచోట్ల ఇబ్బందులు పడాల్సి వస్తోందని ప్రజలు వాపోతున్నారు.

కోసిగి మండలంలో మొత్తం 19 సచివాలయాలు ఉండగా 209 పోస్టులకుగాను 95 మంది సిబ్బంది మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. మరో 106 మందిలో కొందరు మెటర్నిటీ, సుదీర్ఘ సెలవుల్లో ఉండగా, మరి కొందరు రాజీనామా చేశారు. కొన్ని పోస్టులను భర్తీ చేయలేదు. వైకాపా పాలనలో పలువురు సచివాలయ ఉద్యోగులు రాజీనామాలు చేసి వెళ్లిపోయారు. మరి కొంత మంది ఎటువంటి సమాచారం లేకుండానే గైర్హాజరయ్యారు. వారికి నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకొన్నారే తప్పా వారిపై చర్యలు తీసుకోలేదు. ప్రతి సచివాలయంలో 11 శాఖలకు సంబంధించిన సిబ్బంది అందుబాటులో ఉంటారని వైకాపా ప్రభుత్వం గొప్పలు చెప్పారు. వారి హయాంలోనే ఒక్కో సచివాలయంలో ముగ్గురు నుంచి నలుగురికి పరిమితం చేశారు.



తాళం వేసి ఉన్న కోసిగి-4 సచివాలయం (పాతచిత్రం)

మధ్యాహ్నం 2 గంటలకు తాళాలు


మండలంలో దుద్ది, చిర్తనకల్, అగసనూరు, కోసిగి-2, 3, 4 వందగల్లు, సాతనూరు, పల్లెపాడు, చింతకుంట, దొడ్డి బెళగల్ సచివాలయాల్లో ఉన్న అరకొర సిబ్బందిలో ఎవరు వస్తారో.. ఎప్పుడో తలుపులు తెరుస్తారో తెలియదు. కొన్ని చోట్ల మధ్యాహ్నం 2 గంటల సమయంలో సచివాలయాలు తాళాలు వేసి వెళ్లిపోతారంటూ స్థానికులు ఆరోపిస్తున్నారు. వైకాపా ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల నిర్మాణాలను అసంపూర్తిగా వదిలేయడంతో వ్యవసాయ, ఉద్యానశాఖలకు చెందిన సిబ్బంది కూడా సచివాలయాల్లోనే ఉంటున్నారు.

చర్యలు తప్పవు

–రాజేంద్రప్రసాద్, ఎంపీడీవో, కోసిగి

సచివాలయ సిబ్బంది కచ్చితంగా సమయపాలన పాటించాలి. పనిచేసే వేళల్లో కార్యాలయాలు మూసి వేయకూడదు. ఉదయం 10, మధ్యాహ్నం 3, సాయంత్రం 5 గంటలకు బయోమెట్రిక్ హాజరు వేయాలి. విధులు సక్రమంగా నిర్వహించకపోతే చర్యలు తప్పవు.

ప్రమాదవశాత్తు కాలు జారిపడి వ్యక్తి మృతి



పెద్ద ఆంజనేయులు (పాత చిత్రం)

కోసిగి, న్యూస్‌టుడే: ఐదు అంతస్తుల భవనం నుంచి ప్రమాదవశాత్తు కాలు జారిపడి వ్యక్తి మృతి చెందన ఘటన శుక్రవారం అనంతపురంలో చోటు చేసుకుంది. కోసిగి మండలం వందగల్లుకు చెందిన భీమయ్య, మస్తానమ్మ దంపతుల కుమారుడు పెద్ద ఆంజనేయులు(36) రెండు రోజుల కిందట సొంత ఊరిని వీడి బతుకు దెరువు కోసం అనంతపురానికి కూలి పనులకు వెళ్లారు. అక్కడ సెంట్రింగ్ పనులు చేస్తున్న సమయంలో కాలు జారిపడి మృతి చెందారు. పొట్టకూటి కోసం వెళ్లి మృతి చెందిన ఆంజనేయులు కుటుంబాన్ని ఆదుకోవాలని కుటుంబ సభ్యులు కోరారు.

గంజాయి పట్టివేత

ఎమ్మిగనూరు, పెద్దకడబూరు, న్యూస్‌టుడే: పెద్దకడబూరు మండలం హులికన్వి లో గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై నిరంజన్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. గ్రామస్థులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గ్రామంలో తనిఖీలు చేయగా చిన్న ఎల్లప్ప వద్ద 90 ప్యాకెట్లలో ఉన్న 650 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

చేనేతలకు ఉచిత విద్యుత్తు ఇవ్వాలి

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే: చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్తు ఇవ్వాలని చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రాజు, నాయకుడు వీరన్న డిమాండ్ చేశారు. గురువారం కోడుమూరు విద్యుత్తు ఉపకేంద్రానికి వెళ్లి ఏఈ మధుసూదన్‌కు వినతిపత్రం అందజేశారు. కోడుమూరు, ముడుమలగుర్తి, కృష్ణాపురంలోని కార్మికులకు సంబంధించిన 400 దరఖాస్తులను ఏఈకి అందజేశారు.

ఒప్పంద కార్మికులను క్రమబద్ధీకరించాలి

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: ఏళ్ల తరబడి చాలీచాలని వేతనాలతో విధులు నిర్వహిస్తున్న ఒప్పంద పొరుగు సేవల కార్మికులను క్రమబద్ధీకరించాలని సీఐటీయూ డివిజన్ నాయకుడు రాముడు డిమాండు చేశారు. కార్మికులు, సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల ముందు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఎన్డీఏ ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత కూడా కార్మికులకు రావాల్సిన బకాయిలు చెల్లించడం లేదన్నారు. ఈ నెల 30న కలెక్టర్ కార్యాలయాల ముట్టడిస్తామన్నారు. నాయకులు వీరేష్, గోపాల్, రంగన్న, ఈరన్న, వెంకటేశు పాల్గొన్నారు.

కర్నూలు

•కర్నూలు •పాణ్యం

ప్రజారోగ్యానికి పెద్దపీట

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ప్రజారోగ్యానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పెద్దపీట వేశారని ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి తెలిపారు. సీఎం సహాయ నిధి నుంచి వచ్చిన రూ. 18.48 లక్షల చెక్కులను శుక్రవారం పలువురికి అందజేశారు. ఆమె మాట్లాడుతూ బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని పేర్కొన్నారు.


చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

సమస్యలు పరిష్కరించండి

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: తమ సమస్యలు పరిష్కరించాలని ఏపీ గ్రేడ్-2 వీఆర్వోల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జి.వి.రమణ, జిల్లా అధ్యక్షుడు ఆనంద్‌కుమార్, కోశాధికారి కుమార్ యాదవ్ కోరారు. వారు శుక్రవారం కలెక్టరేట్ ఏవో విజయశ్రీని కలిసి మాట్లాడారు. కొందరికి ప్రొబేషన్ ప్రకటించలేదని.. జీవో 166 ప్రకారం పదోన్నతులు ఇవ్వాలని విన్నవించారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
కర్నూలు : 80085 52632
కర్నూలు గ్రామీణం : 85010 05408
ఎమ్మిగనూరు : 63004 66875

కర్నూలు నగరపాలకసంస్థ : సమస్య: సీతారాంనగర్‌లోని వీధుల్లో విద్యుత్తు దీపాలు రాత్రివేళల్లో వెలగడం లేదు. ఇబ్బందులు పడుతున్నాం. - స్థానికులు

సమస్య: శ్రీరామ్‌నగర్‌లో కాలువలు శుభ్రం చేయాలి. వ్యర్థాలు పేరుకుపోయాయి. - స్థానికులు

సమాధానం: సమస్యలు పరిశీలించి పరిష్కరిస్తాం. - నగరపాలక సంస్థ అధికారులు

ఓటరు దరఖాస్తులపై దృష్టి పెట్టండి

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: ఓటరు జాబితా సవరణకు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ప్రత్యేక ఓటర్ల నమోదు, సవరణపై ఈఆర్వోలు, ఏఈఆర్వోలు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇంటింటి ఓటరు సర్వే ప్రక్రియ 99 శాతం పూర్తైందని పేర్కొన్నారు. అక్టోబరు 29వ తేదీ నాటికి ముసాయిదా ఓటరు జాబితా ప్రచురించనున్నట్లు చెప్పారు. జిల్లాలో ప్రస్తుతం 2,186 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, కొత్తగా మరో 17 కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపామని తెలిపారు. 6,199 ఓటరు దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, వీటిపై వెంటనే దృష్టి సారించాలని పేర్కొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ పి.రంజిత్ బాషా

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: ఈవీఎం గోదాము వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీసు గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ పి. రంజిత్ బాషా ఆదేశించారు. త్రైమాసిక తనిఖీలో భాగంగా ఈవీఎంలు భద్రపరిచిన గోదామును రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పరిశీలించారు.

కలెక్టర్ సీసీగా షాలిబాషా

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: కలెక్టర్ క్యాంపు క్లర్కుగా ఉప తహసీల్దారు షాలిబాషా నియమితులయ్యారు. ఈమేరకు ఆయన శుక్రవారం విధుల్లో చేరారు. హైకోర్టు లైజన్ ఆఫీసర్‌గా పనిచేసిన ఆయన రెండేళ్ల కాలపరిమితి పూర్తవడంతో కర్నూలు కలెక్టరేట్‌లో రిపోర్టు చేసుకున్నారు. ఇప్పటికే కలెక్టర్ సీసీలుగా ఉప తహసీల్దారు ప్రవీణ్, రీసర్వే డీటీ ప్రీతమ్ ఉన్నారు.

ఆక్రమణల బాట

పట్టించుకోని నగరపాలక అధికారులు

నగరంలోని పలు ప్రాంతాల్లో పాదబాటలు యథేచ్ఛగా ఆక్రమణలకు గురయ్యాయి. జనం నడిచేందుకు వీలు లేకుండా ఆక్రమించేశారు. కొందరు వ్యాపారులు పాదబాటలపై ఏకంగా పక్కా నిర్మాణాలు చేపట్టారు. మరికొందరు వీటిపై వ్యాపారాలు చేసుకుంటున్నారు. ఫుట్‌పాత్ ఖాళీగా కనిపిస్తే చాలు.. బంకులు, చిరు వ్యాపారాలు వెలుస్తున్నాయి.

కర్నూలు నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే

కర్నూలు నగర పరిధిలో 100 కి.మీ. పైగా పాదబాట నిర్మించారు. బళ్లారి చౌరస్తా, వీకర్ సెక్షన్ కాలనీకి వెళ్లేదారి, కొత్త బస్టాండ్, వెంకటరమణ కాలనీ, నంద్యాల చెక్‌పోస్టు, బిటీ కూడలి, ఆదిత్య కాలనీ కూడలి, బంగారుపేట, కేసీ కాలువ తదితర ప్రాంతాల్లో రూ.లక్షలు వెచ్చించి నిర్మించారు. వీటిపై టైల్స్ సైతం ఏర్పాటుచేశారు. రహదారులపై జనం నడిస్తే ప్రమాదాలు జరుగుతాయన్న ఉద్దేశంతో వీటిని ఏర్పాటుచేశారు. బాగానే ఉన్నా చాలా ప్రాంతాల్లో ఎవరికివారు ఆక్రమించుకుంటున్నారు. వెంకటరమణ కాలనీ, బళ్లారి చౌరస్తా, బస్టాండు తదితర ప్రాంతాల్లో పాదబాటలపై దుకాణాలు ఏర్పాటుచేశారు. అయినప్పటికీ నగరపాలక అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు.



డబ్బులు వసూలు చేస్తూ..

ఆక్రమణదారులకు కొందరు నాయకుల అండ ఉందన్న ఆరోపణలున్నాయి. మరికొన్ని ప్రాంతాల్లో కొందరు నగరపాలక సిబ్బంది డబ్బులు వసూలు చేసి వ్యాపారులకు పచ్చ జెండా ఊపేస్తున్నారు.

రూ.లక్షలు వెచ్చించి.. వారికి అప్పగించి..

ఈ చిత్రంలోని పాదబాట బళ్లారి చౌరస్తా నుంచి కొత్త బస్టాండ్‌కు వెళ్లే మార్గంలోనిది. ఈ ప్రాంతంలో నిత్యం ట్రాఫిక్ సమస్య ఉంటుంది. వాహనాలు నిలిపివేసి ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతూ ఉంటుంది. నగరవాసులు రహదారులపై నడవలేని పరిస్థితి. ఈ నేపథ్యంలో రూ.లక్షలు వెచ్చించి పాదబాట నిర్మించారు. కానీ దుకాణదారులు ఆక్రమించుకోవడంతో తప్పనిసరిగా రోడ్లపై నడవాల్సి వస్తోంది. వాహనదారులు వేగంగా వస్తుండటంతో పలువురు ప్రమాదాలబారిన పడ్డారు.


అడుగడుగునా దుకాణాలే

ఈ చిత్రంలోని పాదబాట వెంకటరమణ కాలనీలోనిది. ఈ ప్రాంతంలో రూ.లక్షలు వెచ్చించి పాదబాటను విశాలంగా నిర్మించారు. పాదచారులు రాకపోకలు సాగించేలా చర్యలు తీసుకున్నారు. కానీ వ్యాపారులు యథేచ్ఛగా ఆక్రమించేశారు. ఈ ప్రాంతంలో అడుగడుగునా దుకాణాలు వెలిశాయి. ఈ మార్గంలో వివిధ శాఖల అధికారులు ప్రతి రోజూ రాకపోకలు సాగిస్తున్నా పట్టించుకున్న దాఖలాలు లేవు. కొందరు చిన్నపాటి వాహనాలను ఫుట్‌పాత్‌లపైకి ఎక్కించి ఇష్టానుసారంగా వ్యాపారాలు చేస్తున్నారు.


ప్రశంసాపత్రాలు అందుకున్న విద్యార్థినులతో అధ్యాపకులు తదితరులు

ప్రముఖ ప్రాంతాలను అన్వేషించాలి

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: పర్యాటక ప్రాంతాలను సందర్శించడంతోపాటు ప్రముఖ ప్రదేశాలను అన్వేషణ చేసే దిశగా యువత ముందుకు సాగాలని జేసీ నవ్య పేర్కొన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని కేవీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ వీవీఎస్ కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. నిత్యం పర్యటనలు చేస్తూ ప్రజా సమస్యలపై అనుశీలన చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థినులకు పోటీలు నిర్వహించి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. అంతకుముందు స్వాతంత్ర్య సమరయోధులైన బుచ్చిబాబు, వరలక్ష్మమ్మను సత్కరించారు. ఈ కార్యక్రమంలో పర్యాటక శాఖ జిల్లా అధికారిణి విజయలక్ష్మి, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

మెరుగైన పారిశుద్ధ్యానికి చర్యలు

కర్నూలు నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే: నగరంలో మెరుగైన పారిశుద్ధ్యానికి చర్యలు తీసుకుంటున్నామని నగరపాలక కమిషనర్ రవీంద్రబాబు తెలిపారు. కలెక్టరేట్, కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఘాట్ వద్ద పారిశుద్ధ్య పనులను శుక్రవారం తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్యాధికారి విశ్వేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థాలు తొలగక.. దుర్గంధం భరించలేక



కర్నూలు మూడో పట్టణ పోలీసుస్టేషన్ సమీపంలో రహదారిపై వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. చెత్త తొలగింపు సక్రమంగా చేయడం లేదు. ఫలితంగా దుర్వాసన వస్తుండటంతో జనం ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే నగరపాలక అధికారులు దృష్టి సారించాలని విన్నవిస్తున్నారు. - న్యూస్‌టుడే, కల్లూరు గ్రామీణ



నియంత్రిక.. రక్షణ కానరాక

కర్నూలు ఎ.క్యాంపు అటవీశాఖ కార్యాలయం సమీపంలో ఉన్న విద్యుత్తు నియంత్రిక ప్రమాదకరంగా మారింది. రక్షణ వలయం లేకపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత శాఖ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, కల్లూరు గ్రామీణ

ఏఎన్ఆర్ నటన అమోఘం

కర్నూలు నగరం, న్యూస్‌టుడే : ప్రేక్షకుల హృదయాల్లో అక్కినేని చెరగని ముద్ర వేసుకున్నారని కర్నూలు టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య అన్నారు. అక్కినేని శత జయంతి ఉత్సవాలు శుక్రవారం సాయంత్రం నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో ప్రారంభమయ్యాయి. ఆయన మాట్లాడుతూ ప్రేక్షకులు నచ్చే.. మెచ్చే ఎన్నో కుటుంబ చిత్రాల్లో ఏఎన్ఆర్ నటించి అందరి మన్ననలు అందుకున్నారని తెలిపారు. అంతకుముందు జ్యోతి వెలిగించి ఉత్సవాలను ప్రారంభించారు. కరీముల్లా, రామకృష్ణ ఆధ్వర్యంలో పలువురు ప్రదర్శనలు ఇచ్చారు.


ప్రసంగిస్తున్న కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య

నా అనుమతి లేకనే జాబితా విడుదల

■ జడ్పీ ఛైర్మన్ ఆవేదన

కర్నూలు నగరం, న్యూస్‌టుడే: ఎంపీడీవోల సంఘం ప్రతినిధులు శుక్రవారం రాత్రి జడ్పీ ఛైర్మన్ పాపిరెడ్డిని జడ్పీలోని ఆయన ఛాంబరులో కలిశారు. ఛైర్మన్ అనుమతి లేకుండా ఎంపీడీవోల బదిలీల ఉత్తర్వులను సీఈవో విడుదల చేసిన విషయమై అసోసియేషన్ ప్రతినిధులు జడ్పీ ఛైర్మన్‌తో చర్చించారు. సీఈవో విడుదల చేసిన పేర్లకు అనుమతి ఇవ్వాలని.. లేకుంటే ఎంపీడీవోలు ఇబ్బందులు పడుతారని ఛైర్మన్‌కు వివరించారు. తన ప్రమేయం లేకుండా సీఈవో కొన్నిపేర్లు ప్రతిపాదించారని, పత్రికలకు సైతం జాబితా విడుదల చేయడం ఎంతవరకు సబబని జడ్పీ ఛైర్మన్ వాపోయినట్లు తెలిసింది.

వాహనాల అద్దాలు ధ్వంసం

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : కర్నూలులో శుక్రవారం రెండు వాహనాల అద్దాలు ధ్వంసమయ్యాయి. జూనియర్ ఎన్టీఆర్ సినిమా దేవర విడుదలైన నేపథ్యంలో గురువారం అర్ధరాత్రి సమయంలో శ్రీరామ థియేటర్ వద్ద అభిమానులు పెద్దఎత్తున చేరుకున్నారు. తోపులాటలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఈ క్రమంలో తమిళనాడుకు చెందిన ఓ ప్రైవేటు బస్సు, పోలీసు వాహనంపై కొందరు రాళ్లు రువ్వడంతో అద్దాలు పగిలిపోయాయి. కర్నూలు రెండో పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కనీస పింఛను అమలు చేయాలి


పీఎఫ్ కార్యాలయం ముందు నిరసన తెలుపుతున్న వివిధ సంఘాల నాయకులు

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే: ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేసి పదవీ విరమణ చేసిన విశ్రాంత ఉద్యోగులకు కనీస పింఛను సౌకర్యం కల్పించాలని వివిధ పింఛనర్ల సంఘాల నాయకులు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అశోక్‌నగర్‌లోని పీఎఫ్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. నాయకులు మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగులు రూ.4 వేల కన్నా తక్కువగా పింఛను అందుకోవడం బాధాకరమన్నారు. అత్యధిక పింఛను అమలు చేయటంలో తీవ్ర జాప్యం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించండి


ఏడీ-1కు వినతి పత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: పురపాలక బడుల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రవికుమార్ కోరారు. డీఈవో కార్యాలయంలో ఏడీ-1 శామ్యూల్‌పాల్‌ను శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్ పదోన్నతులు కల్పించాలన్నారు. రాష్ట్ర సహాధ్యక్షుడు సురేష్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి నవీన్, సహాధ్యక్షుడు హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

రూ.10 లక్షల పరిహారం చెల్లించాలి

ఓర్వకల్లు న్యూస్‌టుడే: గుట్టపాడు సమీపంలోని జైరాజ్ ఇస్పాత్ ఉక్కు పరిశ్రమలో పనిచేస్తూ ప్రమాదవశాత్తు కింద పడి తీవ్రంగా గాయపడిన బిహార్‌కు చెందిన వలస కార్మికుడికి రూ. 10 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని సీపీఎం మండల కార్యదర్శి నాగన్న పేర్కొన్నారు. ఆయన శుక్రవారం కార్మికులతో కలిసి మాట్లాడారు. పరిశ్రమలో పనిచేస్తున్న కేసర్ నెల రోజుల కిందట కిందపడి తీవ్రంగా గాయపడినా యాజమాన్యం పట్టించుకోకపోవటం దారుణమని చెప్పారు.

హిందువుల మనోభావాలు గౌరవించాలి

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే: హిందువుల మనోభావాలను గౌరవించాలని బలిజ రాజకీయ విభాగం నగర అధ్యక్షుడు లక్ష్మన్న అన్నారు. జనసేన అధినేత పవన్‌కల్యాణ్ చేపట్టిన దీక్షకు మద్దతుగా నాయకులు శుక్రవారం కర్నూలు పాత బస్టాండ్‌లోని అంబేడ్కర్ విగ్రహం నుంచి శ్రీకృష్ణదేవరాయల విగ్రహం వరకు పాదయాత్ర నిర్వహించారు. బలిజ సంఘం కార్యదర్శి రవి, కోశాధికారి శైలేష్ మాట్లాడుతూ వైకాపా అధినేత జగన్‌మోహన్‌రెడ్డి తిరుమలను అపవిత్రం చేశారని ధ్వజమెత్తారు. చేసిన తప్పునకు క్షమాపణ కోరకుండా అన్ని కులాలు నావేనంటూ రాజకీయం చేయడం తగదన్నారు.


నినాదాలు చేస్తున్న నాయకులు

29న విద్యాసదస్సు

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: నగరంలోని సిల్వర్‌జూబ్లీ కళాశాలలో 29వ తేదీన రాష్ట్ర స్థాయి విద్యా సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆలిండియా సేవ్ ఎడ్యుకేషన్ కమిటీ రాష్ట్ర కార్యదర్శి సుబ్రహ్మణ్యం తెలిపారు. నగరంలోని కట్టమంచి రామలింగారెడ్డి స్మారక నగరపాలక పాఠశాలలో శుక్రవారం గోడపత్రాలు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ నాలుగేళ్ల డిగ్రీతో యువతకు ఎలాంటి ప్రయోజనం ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వెంకటరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామశేషయ్య, ఓంకార్ తదితరులు పాల్గొన్నారు.

సైనస్ ఎండోస్కోపి పరికరం ప్రారంభం

కర్నూలు వైద్యాలయం, న్యూస్‌టుడే : కర్నూలు సర్వజన వైద్యశాలలో చదివిన కేఎంసీ 1963 పూర్వ విద్యార్థులు.. అరుణ దంపతులు.. గంగులమ్మ జ్ఞాపకార్థం ఇచ్చిన సైనస్ ఎండోస్కోపి యంత్రాన్ని పెద్దాస్పత్రి పర్యవేక్షకుడు డా.ప్రభాకరరెడ్డి శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. రూ. 30 లక్షల విలువైన పరికరాలు వితరణగా ఇచ్చారని.. ఇందులోభాగంగా రూ. 4.5 లక్షల విలువైన సైనస్ ఎండోస్కోపిని ఈఎన్‌టీ విభాగానికి ఇచ్చినట్లు తెలిపారు. డా. వీరకుమార్, డా. శివప్రసాద్ రెడ్డి, డా. హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.


యంత్రాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ ప్రభాకరరెడ్డి తదితరులు

రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటాలి

కర్నూలు క్రీడలు (బి.క్యాంపు), న్యూస్‌టుడే : నగరంలో జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్-14, 17 బాలబాలికల రైఫిల్ షూటింగ్ పోటీలు శుక్రవారంతో ముగిశాయి. విజేతలైన చిన్నారులకు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి గిడ్డయ్య బహుమతులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ జిల్లాస్థాయి పోటీల్లో సత్తా చాటిన చిన్నారులు రాష్ట్రస్థాయి పోటీల్లో పతకాలు సాధించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బాషా, శిక్షకుడు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.


పతకాలు సాధించిన చిన్నారులతో ప్రతినిధులు

కర్నూలు క్రీడలు (బి.క్యాంపు), న్యూస్‌టుడే: జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యే క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో రాణించి పతకాలు సాధించాలని డీవీఈవో పరమేశ్వరరెడ్డి, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సుంకన్న అన్నారు. డీఎస్‌ఏ స్టేడియంలో ఎస్‌జీఎఫ్ అండర్-19 క్రికెట్, వెయిట్‌లిఫ్టింగ్, త్రైక్వాండో బాలబాలికల ఎంపిక పోటీలను వారు శుక్రవారం ప్రారంభించారు.

ఉద్యాన సాగు పెంచేలా కృషి

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరంలో ఉద్యాన పంటల సాగు విస్తీర్ణం పెంచేలా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా ఉద్యానశాఖ అధికారి పి. రామాంజనేయులు తెలిపారు. ఆయన శుక్రవారం క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బందితో సమావేశమయ్యారు. ఇప్పటివరకు నిర్దేశించిన లక్ష్యాలు సాధించామని, మరో వంద రోజుల ప్రణాళికలు నిర్దేశించుకొని ముందుకెళతామని చెప్పారు.

విచారణ జరిపిస్తాం

కర్నూలు సచివాలయం : మంత్రి టీజీ భరత్ పేరు చెప్పి మార్కెట్ కమిటీ వారు ఎవరూ బెదిరించలేదని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి జయలక్ష్మి పేర్కొన్నారు. ఆమె శుక్రవారం మాట్లాడుతూ అయినప్పటికీ విచారణ జరిపి వాస్తవాలు తెలుసుకొని బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. వ్యాపారులను ఎవరు బెదిరించారన్న దానిపై నాలుగో పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామన్నారు.

కాలనీ కబుర్లు

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే: జిల్లా స్థాయి యువజన ఉత్సవాల్లో డా. కేవీ సుబ్బారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ఈసీఈ విభాగం విద్యార్థులు స్మార్ట్ డ్రోన్ ప్రాజెక్టులో ఉత్తమ ప్రదర్శన కనబరిచారు. వీరిని కళాశాల ప్రతినిధులు, అధ్యాపకులు అభినందించారు.

ఓర్వకల్లు న్యూస్‌టుడే: ఓర్వకల్లు తహసీల్దారుగా విద్యాసాగర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న వెంకటరమణ గడివేములకు బదిలీపై వెళ్లారు.

ఓర్వకల్లు న్యూస్‌టుడే: మండలంలోని కాల్వబుగ్గకు చెందిన పలువురు విద్యార్థులు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అథ్లెటిక్స్ పోటీల్లో భాగంగా రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ ప్రసాదరావు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను స్థానిక పాఠశాలలో శుక్రవారం అభినందించారు.

కర్నూలు నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే: కర్నూలు నగరపాలక అదనపు కమిషనర్‌గా ఆర్జీవీ కృష్ణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు కార్యాలయ అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : పౌరసరఫరాల కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన కొంకతి లక్ష్మీనారాయణ శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ పి.రంజిత్ బాషాను మర్యాదపూర్వకంగా కలిశారు. కర్నూలు జిల్లాకు బదిలీపై వచ్చిన జిల్లా గనులు, భూగర్భశాఖ డిప్యూటీ డైరెక్టర్ వి.రవిచందర్ శుక్రవారం కలెక్టర్‌ను కలిశారు. డీడీగా బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుత డీడీ టి.రాజశేఖర్ రిలీవ్ అయ్యారు.

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : జిల్లాకు బదిలీపై వచ్చిన ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ శ్రీనివాసరెడ్డి శుక్రవారం కలెక్టర్ పి.రంజిత్ బాషాను కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు. జిల్లాకు బదిలీపై వచ్చిన వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్ కె.చంద్రశేఖర్‌రెడ్డి శుక్రవారం కలెక్టర్‌ను కలిశారు.

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే: హిందీ పఖ్వాడా కార్యక్రమం ముగింపు సందర్భంగా హైదరాబాద్ డివిజన్‌లో పనిచేస్తున్న పలువురు రైల్వే సిబ్బందికి అవార్డులు, ప్రశంసాపత్రాలను అందజేశారు. కర్నూలు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న సుమిత్‌కుమార్ జైషాకు సికింద్రాబాద్‌లోని రైల్వే నిలయంలో అదనపు రైల్వే డివిజన్ మేనేజర్ ఎం. రెహమాన్ తదితరులు ప్రశంసాపత్రం అందజేశారు.

వివాహిత ఆత్మహత్య


రేణుక (పాత చిత్రం)

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : కర్నూలు శరీన్‌నగర్‌లో రేణుక (28) అనే వివాహిత ఆత్మహత్య చేసుకున్నారు. ఆమె గురువారం అర్ధరాత్రి ఇంట్లో ఉరేసుకోగా కుటుంబసభ్యులు కిందికి దింపి కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆమెకు భర్త జయచంద్ర, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. తన కుమార్తె ఆత్మహత్యకు అల్లుడే కారణమని.. ఇద్దరు ఆడపిల్లలు పుట్టడంతో వేధింపులు తీవ్రమయ్యాయని.. మృతురాలి తల్లి వెంకటలక్ష్మి నాలుగో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్రైం కార్నర్

వాహనం ఢీకొని వ్యక్తి మృతి

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే: కల్లూరు మండల పరిధి పెద్దటేకూరు సమీపంలో జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని కురువ రామచంద్రుడు (65) మృతి చెందారు. పెద్దటేకూరు గ్రామానికి చెందిన అతను పొలం పనుల నిమిత్తం శుక్రవారం తెల్లవారుజామున వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొంది. అతని కుమారుడు మౌలాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఉలిందకొండ ఎస్సై ధనుంజయ తెలిపారు.

గొలుసు దొంగల హల్‌చల్

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : కర్నూలులోని అమీన్ అబ్బాస్‌లో గొలుసు దొంగలు పేట్రేగిపోయారు. శుక్రవారం ఉదయం 8.30 సమయంలో అదే కాలనీకి చెందిన సుజాతమ్మ అనే వృద్ధురాలు మందుల కోసం నడుచుకుంటూ వెళ్తున్నారు. ఇద్దరు దుండగులు ద్విచక్ర వాహనంపై అనుసరించి ఆమె మెడలోని గొలుసు తెంపుకొని ఉడాయించారు. అపహరణకు గురైన గొలుసు రెండు తులాలు ఉన్నట్లు బాధితురాలు తెలిపారు. ఈ నేరానికి పాల్పడిన దుండగులు మళ్లీ సమీప ప్రాంతంలో మరో మహిళ మెడలో గొలుసును తెంపేందుకు విఫలయత్నం చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రామలింగేశ్వర్ నగర్‌లో..

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : కర్నూలు రామలింగేశ్వర్‌నగర్‌లో గొలుసు దొంగలు శుక్రవారం హల్‌చల్ చేశారు. అదే కాలనీకి చెందిన జయశ్రీ శుక్రవారం ఉదయం కిరాణా దుకాణం నుంచి ఇంటికి వెళ్తున్నారు. ఇద్దరు దుండగులు బైకుపై అనుసరిస్తుండటాన్ని ఆమె గమనించారు. దుండగులు ఒక్కసారిగా సమీపించి మెడలోని గొలుసు తెంపే యత్నం చేయగా ఆమె అప్రమత్తమై గట్టిగా కేకలేయడంతో వారు పారిపోయారు. నాలుగో పట్టణ పోలీసులు సీసీ ఫుటేజీ ద్వారా దుండగులను గుర్తించే యత్నం చేస్తున్నారు.

యుద్ధ శిక్షణ.. స్వీయ రక్షణ

● విద్యార్థినులకు పలు అంశాల్లో తర్ఫీదు

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థి దశ నుంచే పోటీతత్వాన్ని అలవర్చుకోవడంతోపాటు స్వీయ రక్షణతో ముందుకు సాగుతున్నారు. నగరంలోని కేవీఆర్ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు ఎన్‌సీసీ ఏ, బీ, సీ ధ్రువపత్రాలు పొందడంతోపాటు రాష్ట్ర, దేశ స్థాయిలో ఏటా నిర్వహించే గణతంత్ర, స్వాతంత్ర్య వేడుకల్లో ప్రతిభ చాటుతున్నారు. గతేడాది జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా రాష్ట్ర స్థాయిలో జరిగిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో ప్రథమ స్థానం సాధించారు. ఇక్కడ చదువుకున్నవారే ప్రస్తుతం విద్యాబోధనతోపాటు కళాశాల అభివృద్ధికి కృషి చేస్తున్నారు. ముఖ్యంగా విద్యార్థినులకు కర్ర సాము, కత్తి సాము, కుస్తీ, కరాటే, బాక్సింగ్‌తోపాటు పలు క్రీడల్లో శిక్షణ ఇస్తున్నారు.


కరాటేలో శిక్షణ పొందుతున్న విద్యార్థినులు

ప్రస్తుతం డిగ్రీలో సుమారు 2 వేల మంది, పీజీలో 150 మంది విద్యార్థినులు చదువుకుంటున్నారు. ప్రభుత్వం ప్రారంభించిన ఇంటర్న్‌షిప్‌ను ఉపయోగించుకుంటూ ప్రతి విద్యార్థిని స్వయం ఉపాధి శిక్షణ పొందుతున్నారు.

జూనియర్లకు నేర్పిస్తున్నా


- లావణ్య, బీఎస్సీ ద్వితీయ



కేవీఆర్ కళాశాలలో బీఎస్సీ హోమ్ సైన్స్ చదువుతున్నా. విద్యతోపాటు అత్యవసర సమయంలో స్వీయ రక్షణ పొందేందుకు తర్ఫీదు ఇస్తున్నారు. కత్తి సాముపై ఆసక్తి పెంచుకుని మెలకువలు నేర్చుకుని జూనియర్ విద్యార్థినులకు నేర్పిస్తున్నా. చదువులో అధ్యాపకుల ప్రోత్సాహం మరువలేనిది.

కర్ర సాముపై పట్టు సాధించా

- సుహాసిని, ద్వితీయ



నేను ఎంపీసీఎస్ ద్వితీయ సంవత్సరం అభ్యసిస్తున్నా. కళాశాలలో చేరినప్పటి నుంచి స్వీయ రక్షణ మెలకువలు నేర్చుకున్నా. కర్ర సాముపై దృష్టి సారించి ఆపద సమయంలో ఎలా రక్షించుకోవాలో పూర్తి స్థాయిలో నైపుణ్యాలు పెంపొందించుకున్నా.

విద్యార్థినులకు తప్పనిసరి

- వీవీఎస్ కుమార్, ప్రధానాచార్యుడు

ప్రస్తుత సమాజంలో మహిళలపై దాడులు అధికమయ్యాయి. వాటి నుంచి స్వీయ రక్షణ పొందేందుకు ప్రత్యేక మెలకువలు ఉపయోగపడతాయి. డిగ్రీ విద్యార్థినులు ఎన్‌సీసీ ఆధ్వర్యంలో కత్తి, కర్ర సాము, బాక్సింగ్, కుస్తీ పోటీల్లో శిక్షణ పొందుతున్నారు.

ఇచ్చిన హామీలు అమలు చేయాలి


మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే: ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం అమలుచేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. నగరంలోని కేకే భవన్‌లో శుక్రవారం మాట్లాడారు. పెట్టుబడి సాయం కింద ఇస్తామన్న రూ. 20 వేలు వెంటనే ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. గతేడాది ఖరీఫ్, రబీ సీజన్లలో నష్టపోయిన రైతులకు పంట నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమగ్ర పంటల బీమా పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ ఉయ్యాలవాడ గ్రామంలో సోలార్ ప్లాంటు ఏర్పాటు ఆలోచనను విరమించుకోవాలన్నారు.

ఉల్లి క్వింటా గరిష్ఠ ధర రూ.4,009

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: కర్నూలు వ్యవసాయ మార్కెట్‌కు శుక్రవారం 4,366 క్వింటాళ్ల ఉల్లి దిగుబడులు రాగా క్వింటా కనిష్ఠ ధర రూ.309, గరిష్ఠ ధర రూ.4,009 పలికింది. వేరుశనగకాయలు క్వింటాల్ గరిష్ఠ ధర రూ. 7,010, పూలవిత్తనాలు రూ. 6,280, ఆముదాలు రూ. 5,981, మొక్కజొన్నలు రూ. 2,450, కందులు రూ. 10,282కు వ్యాపారులు కొనుగోలు చేశారు.